


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న


RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 83, పేజీలు - 08

బుధవారం, ఆగష్టు 27, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

2లో..




## భారత్ బాటలో మరో 25 దేశాలు

2లో..



## మన నౌకలు అమెరికా ఎఫ్-35 లాంటివి

2లో..




## ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు తప్పనిసరి

2లో..

# సభలో ఇక సమరమేనా.?

- ఈనెల 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు
- కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే చర్చ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 30వ తేదీ నుంచి ఈ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నట్లు సమాచారం. మొత్తం 5 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడానికి ఒకరోజు ముందు అంటే ఈనెల 29వ తేదీన తెలంగాణ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నిర్ణయాన్ని ఈ కేబినెట్ భేటీలోనే తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ ఇచ్చిన రిపోర్టును చర్చించేందుకే ఈ అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఆకస్మికంగా మరణించిన జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సమావేశాల తొలి రోజే అసెంబ్లీలో సంతాపం ప్రకటించనున్నారు. అదే సమయంలో ఈ సమావేశాల్లోనే ఉపసభాపతిని ఎంపిక చేయడంపైనా నిర్ణయం తీసుకోనున్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికకు ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.
ఈ నేపథ్యంలోనే ఈ సమావేశాల్లో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇక ఈ సమావేశాల్లోనే సభలోని ఎమ్మెల్యేలందరికీ జస్టిస్

2లో..

## తూర్పు తీరంలో
# చైనాకు చెక్

- భారత నావికాదళంలోకి ఉదయగిరి, హిమగిరి



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** భారత నౌకాదళంలోకి రెండు యుద్ధ నౌకలు చేరాయి. నీల్‌గిరి క్లాస్ యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఒకేసారి రెండు భారీ యుద్ధ నౌకలు జలప్రవేశం చేయడం భారత నౌకాదళ చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఏడాది జనవరిలో ఐఎన్ఎస్ నీల్‌గిరి నేవీలో చేరిన విషయం తెలిసిందే. ఐఎన్ఎస్ హిమగిరి, ఉదయగిరి యుద్ధ నౌకలను రెండు వేర్వేరు

2లో..

# గులాబీ గుబాళించేనా.?

- స్థానిక యుద్ధంలో కారు స్పీడ్ అందుకోలేదా? బ్రేకులు తప్పవా?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంత మేరకు విజయం సాధిస్తుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాలలో హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తుంది. ఈ రెండేళ్ల పాలనపై కాంగ్రెస్ పనితీరుపై ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారన్న విషయం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు ఒక అడ్వాంటేజీ ఉంది. అదేమంటే అధికారంలో ఉండటంతో బలం, బలగానికి సంబంధించి మాత్రమే కాకుండా అన్ని విషయాల్లో అది ముందుకు వెళ్లే అవకాశముంది. కానీ బీఆర్ఎస్ విషయంలో అలా చూడలేం. గత రెండేళ్లుగా బీఆర్ఎస్ ప్రతిపక్షంగా పెద్దగా సక్సెస్ ఫుల్ గా పనిచేయలేదన్న విమర్శలు బాగా వినిపిస్తున్నాయి.

2లో..

# చంద్రబాబు మార్క్ ప్రక్షాళన

- బదిలీలు, కీలక నియామకాలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళన కు సీఎం చంద్రబాబు నిర్ణయించారు. భారీగా ఐఏఎస్, ఐపీఎస్ ల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. కొంత కాలంగా బదిలీల పైన చర్చ సాగుతున్నా ఇప్పుడు కొలిక్కి వచ్చింది. రాష్ట్ర స్థాయి తో పాటుగా పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు స్థాన చలనం ఖాయం గా కనిపిస్తోంది. ప్రధాన శాఖల అధిపతులు మారనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం పూర్తి కానుండటంతో అధికారుల పనితీరు ప్రామాణికంగా మార్పులు చేసేందుకు సీఎం చంద్రబాబు సమాయత్తం అయ్యారు. కూటమి ప్రభుత్వంలో పూర్తి స్థాయి ప్రక్షాళన దిశగా సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. మరో సారి భారీ స్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలకు రంగం సిద్దమైంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ఒకే సారి 62 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. అదే విధంగా భారీ స్థాయిలో ఐపీఎస్ బదిలీలు జరిగాయి. పాలనా సౌలభ్యం కోసం మధ్యలో కొందరి అధికారుల బదిలీలు జరిగాయి. ఇక ఏడాది పాలన పూర్తయిన తరువాత అధికారుల పనితీరు ఆధారంగా మార్పులు చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పుడు ఈ మేరకు కసరత్తు పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రధాన శాఖల అధిపతుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు బదిలీల జాబితాలో ఉన్నట్లు సమాచారం.

2లో..

# దొంగ ఓట్లు తొలగించి ఎన్నికలకు వెళదామా.?

కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న బండి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు చేస్తున్న "దొంగ ఓట్లు" ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన "దొంగ ఓట్లతో బీజేపీ నేతలు గెలిచారు" అనే ఆరోపణల్లో నిజం లేదన్నారు. తెలంగాణలో అధికారం మీ చేతిలో ఉంది కదా. అలాగైతే వెంటనే దొంగ ఓట్ల జాబితాను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొంగ ఓట్లను తొలగించాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయాలని బండి సంజయ్ అన్నారు. దొంగ ఓట్ల రద్దు తరువాత అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళదాం. కాంగ్రెస్ కనుక ఎన్నికల్లో గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఛాలెంజ్ స్వీకరించగలదా? అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

**కరీంనగర్ ప్రజలను అవమానించడమే?**

తాను కరీంనగర్ నుంచి 2,25,000 ఓట్ల మెజారిటీతో గెలిచానని.. దొంగ ఓట్ల వల్ల అని మాట్లాడడం, కరీంనగర్ ప్రజలను అవమానించడం కాకపోతే మరేంటి?" అని బండి సంజయ్ మండిపడ్డారు. మహేశ్ గౌడ్‌కు చరిత్ర గుర్తుండదు అని ఎద్దేవా చేశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను చూస్తే 'గజిని' సినిమా గుర్తొస్తుంది. ఒక్కసారి బండి సంజయ్‌ను బీసీ అని విమర్శిస్తారు. మరి ఇప్పుడు దేశ్‌ముఖ్ అని నన్ను పిలుస్తున్నారు. అంటే మహేష్ గౌడుకు తాను చెప్పింది ఏమిటో కూడా గుర్తుండదు అని ఎద్దేవా చేశారు. ఒక్కసారి కూడా వార్డు మెంబర్ గానైనా గెలవని టీపీసీసీ చీఫ్‌కు ఓట్ల చోరీ గురించి ఏమి తెలుస్తుంది?" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**- పంచాయతీలకు నిధులు ఇచ్చిందెవరు?**

"20 నెలల పాలనలో ఒక్క పైసా కూడా పంచాయతీలకు నిధులు ఇవ్వని పార్టీ కాంగ్రెస్. కేంద్రం నిధుల కోసమే

2లో..

## పంచాయతీ ఎన్నికలపై
# బిగ్ అప్‌డేట్

- సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితా విడుదల




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో సెప్టెంబర్ 30వ తేదీలోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని.. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ముమ్మరం చేసింది. వీలైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్న ఎన్నికల సంఘం దానికి సంబంధించిన చర్యలను చేపడుతోంది. ఇందులో భాగంగానే ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన షెడ్యూల్ రిలీజ్ చేసింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసింది.

2లో..

# రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

- బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచిపోయిందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు

2లో..

## 9.5 లక్షల మంది
# రైతులకు పండగే

- సాదాబైనామాల క్రమబద్ధీకరణకు హైకోర్టు అనుమతి
- తొమ్మిది లక్షల మందికిపైగా పేదలుకు ప్రయోజనం
- 2020 అక్టోబరులో తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ




2లో..

## రేవంత్ రెడ్డికి బిగ్ షాక్ ఇచ్చిన ఎన్జీటీ

- కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకానికి బ్రేక్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రైబ్యూనల్(ఎన్జీటీ) ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేకుండా పనులు కొనసాగించడంపై మండిపడింది. రైతులు, స్థానికుల ఫిర్యాదులపై చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రైబ్యూనల్(ఎన్జీటీ) స్పందించింది.

2లో..

# సభలో ఇక సమరమేనా.?

పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం అందించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ అసెంబ్లీ సమావేశాలు దాదాపు 5 రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కోసం ఇప్పటికే అసెంబ్లీ సిబ్బందికి సంబంధిత ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన రిపోర్టు 600 పేజీలకు పైగా ఉంది. ఈ రిపోర్టును సభ్యులందరికీ అందజేసి అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుని ఆ తర్వాత దీనిపై పూర్తి స్థాయిలో చర్చించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. చర్చల తర్వాత కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి తుది నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీష్ రావులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

# తూర్పు తీరంలో చైనాకు చెక్

షిప్ యార్డులో నిర్మించారు. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్‌లో ఐఎన్ఎస్ హిమగిరి, ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్‌లో ఐఎన్ఎస్ ఉదయగిరి నిర్మాణం జరిగింది. కానీ, రెండూ ఒకే సమయంలో పూర్తికావడం చెప్పుకోదగ్గ అంశం. యుద్ధ నౌకల డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థను అత్యాధునిక సాంకేతికతతో రూపొందించారు. ఈ నీల్‌గిరి క్లాస్ యుద్ధ నౌకల తయారీలో 75 శాతం స్వదేశీ పరిజ్ఞానం వినియోగించారు. ఇది కేంద్రంలోని మోదీ ప్రభుత్వ చేపట్టిన మేకిన్ ఇండియా కార్యక్రమానికి ఊతమిస్తోంది. అయితే, దేశీయ పారిశ్రామిక-సాంకేతిక సామర్థ్యం, స్వదేశీ పరిజ్ఞానంతో ప్రాంతీయ శక్తి సమతౌల్యతను ప్రదర్శించే మూడు యుద్ధ నౌకల స్క్వాడ్రన్‌ను ఇండియన్ నేవీ కలిగి ఉంది. హిమగిరి, ఉదయగిరి చేరికతో భారత నౌకాదళం పోరాట సంసిద్ధత మరింత పెరుగుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భారతీయ షిప్‌యార్డ్‌లు అనుసరించిన మాడ్యులర్ నిర్మాణ విధానం ఫలితంగా ఈ తరగతిలో పరీక్షించిన తర్వాత జాతికి అంకితం చేసిన వేగవంతమైన ఓడగా ఉదయగిరి ఘనత సాధించింది. ఐఎన్ఎస్ ఉదయగిరి, హిమగిరిలను నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరోనే డిజైన్ చేసింది. ఈ క్రమంలో వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ యుద్ధ నౌకగా ఉదయగిరి నిలిచింది. ఇటీవలే నౌకదళం నుంచి సేవలను ఉపసంహరించి, 30 ఏళ్లకు పైగా దేశానికి విశిష్ట సేవలందించిన యుద్ధ నౌకల పేరునే వీటికి పెట్టారు. కమిషన్డ్ తర్వాత, రెండు యుద్ధనౌకలు తూర్పు నౌకాదళంలో చేరతాయి.. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశ ప్రయోజనాలను కాపాడుకునే సామర్థ్యాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. ఒక్కొక్కటి దాదాపు 6,700 టన్నుల బరువుతో మునుపటి శివాలిక్-క్లాస్ యుద్ధ నౌకల కంటే దాదాపు ఐదు శాతం పెద్దవి. వాటి ఆకారం, రాడార్ క్రాస్-సెక్షన్‌ను మాత్రం తగ్గించారు.

### - ఐఎన్ఎస్ ఉదయగిరి

ముంబయిలోని మజగావ్ డాక్స్ షిప్‌బిల్డర్స్ తయారుచేసిన ఐఎన్ఎస్ ఉదయగిరి పొడవు 149 మీటర్లు. దీని వేగం గంటకు 28 నాటికల్ మైళ్లు (గంటకు 52 కిలోమీటర్లు). ఇందులో 48 బరాక్-8 క్షిపణులు, 8 బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు సహా పలు ఆయుధాలు ఉంటాయి. దీనిపై నుంచి ఒకేసారి రెండు హెలికాప్టర్లను ఆపరేట్ చేయొచ్చు. డీజిల్ ఇంజిన్లు, గ్యాస్ టర్బైన్ల ద్వారా శక్తిని పొంది నియంత్రించదగిన-పిచ్ ప్రొపెల్లర్లను నడుపుతాయి. ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ఇంటర్‌ఫేస్ ద్వారా నిర్వహణ సాగుతుంది.

### -ఐఎన్ఎస్ హిమగిరి

కొలకతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ తయారు చేసిన ఈ ఆధునిక యుద్ధనౌక.. ఐఎన్ఎస్ ఉదయగిరి తరహాలోనే పొడవు, బరువు, గరిష్ఠ వేగం కలిగి ఉంది. ఈ నౌకలో ఒకేసారి రెండు హెలికాప్టర్లు ప్రయాణించగలవు. 32 బరాక్%-%8 క్షిపణులు ( వాయుసేన రక్షణ కోసం), 8 బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు (శత్రు నౌకలపై విధ్వంసకర దాడుల కోసం), మరీచ్ టార్పెడో డికాయ్ సిస్టమ్ (శత్రు జలాంతర్గామి దాడులను ఏమార్చడానికి) ఇందులో ఉన్నాయి.

### - ఇతర యుద్ధ సామగ్రి

ఈ నౌకలో అదనంగా విస్తృత స్థాయి ఆయుధాలు అమర్చారు. ఉపరితలం నుంచి ఉపరితలలో ప్రయోగించే క్షిపణులు, ఉపరితలం నుంచి గాల్లోకి ప్రయోగించి మధ్యమ శ్రేణి క్షిపణులు. 76 ఎంఎం ఎంఆర్ గన్, 30 ఎంఎం, 12.7 ఎంఎం సమీప రక్షణ ఆయుధ వ్యవస్థలు (సీఐడబ్ల్యూఎస్), జలాంతర్గాములపై దాడిచేయగలిగే యుద్ధ ఆయుధ వ్యవస్థలను ఇందులో అమర్చారు.

# గులాబీ గుబాళించేనా.?

### - ఫామ్ హౌస్ కే పరిమితమయి..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల్లో ఓటమి పాలయిన నాటి నుంచి ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆయన అప్పుడప్పుడు జనంలోకి వచ్చినా అది పార్లమెంటు ఎన్నికల సందర్భంగానే. ఇక గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగి కొన్నినెలలు గడిచాయి. వరంగల్ లో జరిగిన భారీ బహిరంగ సభలో ఇకపై జనంలోనే ఉంటానని కేసీఆర్ చెప్పారు. ఏప్రిల్ లో జరిగిన ఈ బహిరంగ సభ తర్వాత కేసీఆర్ జనంలోకి వచ్చింది లేదు. ఎక్కడా కార్యక్రమాల్లో పాల్గొనింది లేదు. ఆయన చెప్పిన మాట మీద నిలబడడు అనడానికి ఇది ఉదాహరణ అని పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. సిల్వర్ జూబ్లీ సభ జరిగిన తర్వాత ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ అధినేత గళం విప్పకపోవడాన్నికూడా కొందరు తప్పుపడుతున్నారు.

### - రెండుగా చీలడంతో..

ఇక అదేసమయంలో బీఆర్ఎస్ లోనూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితల మధ్య ఆధిపత్య పోరు కూడా ప్రజల్లో పార్టీని పలుచన చేసింది. పార్టీ క్యాడర్ లోనూ అయోమయం నెలకొంది. ఎవరు అవునన్నా, కాదన్నా పార్టీలో రెండు గ్రూపులు అయితే ఉన్నాయన్నది కవిత రాస్తున్న లేఖల ద్వారా బయటపడుతుండటంతో నవ్వులపాలయింది కారు పార్టీ. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలనుకున్నా ముందు ఫ్యామిలీ సర్కస్ మాటేమిటని ప్రత్యర్థులు ప్రశ్నించే అవకాశముంది. అలాగే ఇప్పుడు రెండు గ్రూపులు కారు పార్టీలో బహిరంగంగా సవాళ్లు విసురుకుంటుండటంతో క్యాడర్ లో కూడా నిరుత్సాహం నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు ఎలా ముందుకు వెళుతుందన్నది చూడాల్సి ఉంది. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ వెళ్లినా ఫలితం ఎంత మేరకు కనిపిస్తుందన్నది ఆ పార్టీ నేతలకు మింగుడపడటం లేదు.

# చంద్రబాబు మార్క్ ప్రక్షాళన

పలు ప్రధాన శాఖల్లో మంత్రులు - శాఖాధిపతుల మధ్య సమన్వయం సరిగ్గా లేదు. దీంతో, వీరి విషయంలోనూ చంద్రబాబు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అమరావతి వ్యవహారాలు కీలకంగా మారుతున్నాయి. దీంతో రాజధాని పరిధి ఉన్న గుంటూరు జిల్లా కలెక్టర్ మార్పు ఖాయంగా కనిపిస్తోంది. ఆరోగ్య, వ్యవసాయ, కార్మిక, విద్యుత్ శాఖల్లోనూ ముఖ్య అధికారులకు స్థాన చలనం కలగనున్నట్లు సమాచారం. పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల బాధ్యతల్లోనూ మార్పులు చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఆరు జిల్లాల ఎస్పీలు మారే అవకాశం కనిపిస్తోంది. కరెక్ట్ ఆఫీసర్ ఇన్ కరెక్ట్ పొజీషన్ అన్న పద్ధతిలో అన్నీ పరిశీలించి బదిలీలపై చంద్రబాబు కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. దీంతో, ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే ఉత్తర్వుల పైన ఆసక్తి నెలకొంది.

# రేవంత్ రెడ్డికి బిగ్ షాక్ ఇచ్చిన ఎన్జీటీ

ఈ మేరకు పర్యావరణ అనుమతులు లేని కారణంగా పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మెట్ట ప్రాంత రైతుల చిరకాల స్వప్నంగా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఉంది. ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని 2014లోనే జీఓ జారీ అయినప్పటికీ ఏళ్లుగా అమలుకు నోచుకోలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఏడాది ఫిబ్రవరి 21న సీఎం రేవంత్ రెడ్డి నారాయణపేట-కొడంగల్-మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించారు. నిర్మాణ అంచనా రూ.4,350 కోట్లుగా పేర్కొన్నారు. ఈ పథకానికి 2024-25 బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా రూ.610 కోట్లను కేటాయించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చడానికి వీలుగా రెండు దశల్లో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. అయితే తాజాగా నేషనల్ గ్రీన్ ట్రైబ్యూనల్(ఎన్జీటీ) రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. పర్యావరణ అనుమతులు లేని కారణంగా ఈ ప్రాజెక్ట్ పనులను ఆపివేయాలని ఎన్జీటీ స్పష్టం చేసింది. ఈ పథకం పనులపై రైతులు నర్సింహులు, మరో ముగ్గురు స్థానికులు ఎన్జీటీలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్ జీటీ నుంచి ఈ ఆదేశాలు వచ్చాయి. ఎన్జీటీ తెలిపిన ప్రకారం ప్రాజెక్ట్ పనులు వెంటనే నిలిపివేయకపోతే, బాధితులు మళ్లీ తమను సంప్రదించవచ్చని పేర్కొంది. ఎన్జీటీ ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం త్వరగా మార్గదర్శక చర్యలు చేపట్టనుంది. ఈ ప్రాజెక్ట్ రద్దు లేదా ఆలస్యం జరిగితే, రాష్ట్రానికి ఆర్థిక, సామాజిక పరిమాణంలో పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

# దొంగ ఓట్లు తొలగించి ఎన్నికలకు వెళదామా.?

పంచాయతీ ఎన్నికలు జరుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులిచ్చింది కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే. ఓట్ల కోసం యాచన చేయాల్సిన స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. హిందువులపట్ల చులకన ధోరణితో వ్యవహరిస్తూ, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. నేను గెలిచానంటే అది హిందూ ఓట్లతోనే. తెలంగాణలో బలమైన హిందూ ఓటు బ్యాంకు నిర్మించడమే మా లక్ష్యం" అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

### - మత రాజకీయాలపై విమర్శలు

కాంగ్రెస్ మతం పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లలా మారింది. మసీదుల్లోకి వెళ్లి టోపీ పెట్టుకుని ప్రార్థనలు చేస్తూ కొందరు నేతలు నటిస్తారు. కానీ హిందువులు గణేశ్ ఉత్సవాల్ని జరుపుకోవాలన్నా కూడా షరతులు పెడతారు. బీజేపీ అధికారంలోకి వస్తే చట్టపరంగా గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. హిందూ ధర్మ పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుంది" అన్నారు.

### - రోహింగ్యాలపై ఆరోపణలు

"రోహింగ్యాలు 2014కి ముందే దేశంలోకి అక్రమంగా వచ్చారు. అప్పట్లో పాలకులెవరో మర్చిపోకండి. అప్పుడే దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నదని ఆ పార్టీ నేతలకే గుర్తులేదు. ఇప్పుడు వారిని వెనక్కి పంపిద్దామంటే కూడా కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి సహకరించడంలేదు. మేము అయితే సరిహద్దుల్లో ఫెన్సింగ్ పెట్టాము, అక్రమ వలసను అడ్డుకుంటున్నాం. విదేశీయులు పాస్‌పోర్టు, వీసా గడువు ముగిశాక వాళ్లను దేశం నుంచి వెనక్కి పంపిస్తున్నామని" బండి సంజయ్ అన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై బిగ్ అప్‌డేట్

జిల్లా పంచాయతీ అధికారులు వచ్చే నెల (సెప్టెంబర్) 2వ తేదీ నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లో ఫొటో ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేయనున్నట్లు తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఈనెల 28వ తేదీన వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ లిస్ట్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఆ తర్వాత ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయిలో 30వ తేదీన మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇక ఓటర్ జాబితాకు సంబంధించి ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత చివరగా సెప్టెంబర్ 2వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం తాజాగా స్పష్టం చేసింది. తెలంగాణలో సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31వ తేదీనే ముగిసింది. దీంతో గ్రామాల్లో సర్పంచ్‌ల చెక్ పవర్ పోయి పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. అయితే గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఒకటిన్నరేళ్లు పూర్తి అయినా పలు కారణాలతో ఎన్నికల నిర్వహణ ముందుకు సాగలేదు. ఈ క్రమంలోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టులో దాఖలైన పిటిషన్లను విచారించిన ధర్మాసనం జూన్ 25వ తేదీన తుది తీర్పును వెలువరించింది. 3 నెలల్లోగా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని కీలక తీర్పును ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజనను పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది.

# రొటీన్ సమావేశాలు వద్దు..
# ప్రజల కోసం పనిచేయండి

సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

# 9.5 లక్షల మంది రైతులకు పండగే

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఐదేళ్లుగా కొనసాగుతోన్న సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించిన తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. క్రమబద్ధీకరణకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. దీంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఉన్న అడ్డంకి తొలగిపోయింది. అక్టోబరు 12, 2020 నుంచి నవంబరు 10 మధ్య దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది. ఈ సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించిన 2020 అక్టోబరు 10న తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ, ఈ జీవోపై అదే ఏడాది నవంబరులో హైకోర్టు స్టే విధించింది. చట్టంలో నిబంధనలు లేకుండా ఎలా క్రమబద్ధీకరిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. అయితే, కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో ఈ క్రమబద్ధీకరణ అంశం పొందుపరిచినట్లు కోర్టుకు తాజాగా ప్రభుత్వం తెలియజేసింది. ఈ వివరణతో సంతృప్తి చెందిన న్యాయస్థానం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ కేసు విచారణను ముగించింది. కోర్టు తీర్పుతో తెలంగాణలోని 9.5 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఎటువంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా సాగు చేసుకుంటున్న రైతులకు ఊరటనిచ్చేలా తీర్పు వెలువరించింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతవారంలోనే హైకోర్టు స్టే తొలగించగా ఇప్పుడు కేసు విచారణ ముగించి, రిజిస్ట్రేషన్‌కు అనుమతించింది. భూమి రిజిస్ట్రేషన్ అనేది ప్రతి ఒక్కరికీ చాలా కీలకం. రిజిస్ట్రేషన్ ఉంటేనే వారు హక్కుదారు అవుతారు. ఒకవేళ అలా కాకుంట ఆ భూమిపై హక్కులను నిరూపించుకోవడానికి నానా తంటాలు పడాల్సిందే. గతంలో భూములను కొన్నా, అమ్మినా కేవలం స్టాంపు పేపర్లపై ఒప్పందాలు, నోట్లు మాత్రమే రాసుకునేవారు. ఈ పత్రాలపై బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేయవు. తెలంగాణలో ఇటువంటి భూములకు కలిగిన రైతులు తొమ్మిదిన్నర లక్షల మంది ఉన్నారని అంచనా. తాజా, తీర్పు వారికి ఎంతో మేలు జరగనుంది. ఇక, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో సాదాబైనామాల క్రమబద్ధీకరణ కూడా ఒకటి. కాగా, ఈ తీర్పుపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాదాబైనామాల పరిష్కారానికి భూభారతి చట్టం దారి చూపిందని అన్నారు. త్వరలో 9 లక్షలకుపైగా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పు లక్షలాది మంది పేద ల కలలను సాకారం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సాదాబైనామాల విషయంలో కేసీఆర్ ప్రజలను నమ్మించి మోసం చేశారని మంత్రి పొంగులేటి విమర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిష్కరించకుండా వదిలేశారని ఆయన దుయ్యబట్టారు.

# మన నౌకలు అమెరికా ఎఫ్-35 లాంటివి

### – అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లతో రూపకల్పన

విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) "అమెరికాకు గగనతలంలో దూసుకెళ్లే ఎఫ్-35 ఫైటర్ జెట్లు ఉంటే, మనకు నీటిపై తేలియాడే ఎఫ్-35 యుద్ధనౌకలు ఉన్నాయి" అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తూర్పు నౌకాదళ కమాండ్ వేదికగా భారత నావికాదళ అమ్ములపొదిలోకి మరో రెండు శక్తిమంతమైన యుద్ధనౌకలు చేరాయి. ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి పేరుతో నిర్మించిన ఈ మల్టీ-మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్లను ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, నావికాదళం స్వదేశీ పరిజ్ఞానంతో ఒక తేలియాడే ఎఫ్-35ను నిర్మించిందని ప్రశంసించారు. అమెరికాకు చెందిన ఎఫ్-35 జెట్లు వాటి వేగానికి, శత్రువుల రాడార్లకు చిక్కని స్టెల్త్ సామర్థ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. మన యుద్ధనౌకలు కూడా అలాంటి అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లతో కూడిన ఈ నౌకలు మన సముద్రాలకు అజేయ రక్షకులుగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పూర్తిగా భారత్‌లోనే నిర్మించిన ఈ నౌకల్లో సుదూర లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, సూపర్‌సోనిక్ క్షిపణులు, రాకెట్ లాంచర్లు, టార్పెడోలు, ఫైర్-కంట్రోల్ వ్యవస్థలు వంటివి ఉన్నాయని రాజ్‌నాథ్ వివరించారు. ప్రాజెక్ట్ 17ఏ కింద ఈ నౌకలను అభివృద్ధి చేశారు. వీటిలో ఐఎన్ఎస్ ఉదయగిరిని ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎల్), ఐఎన్ఎస్ హిమగిరిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మించాయి. గతంలో 30 ఏళ్లకు పైగా దేశానికి సేవలందించిన పాతతరం యుద్ధనౌకల పేర్లనే వీటికి పెట్టడం విశేషం. ఈ రెండు నౌకల రాకతో భారత నౌకాదళం 'బ్లూ వాటర్ నేవీ'గా మరింత బలోపేతమైందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. భవిష్యత్ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, ఆయుధ సంపత్తిని పెంచుకోవాలని ఆయన బలగాలకు పిలుపునిచ్చారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

### - పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది" అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు.భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు. 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

# భారత్ బాటలో మరో 25 దేశాలు

### - అమెరికాకు పోస్టల్ సర్వీసులు బంద్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ వాణిజ్యం, తపాలా సేవలపై తీవ్ర ప్రభావం చూపేలా అమెరికాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న కొత్త సుంకాల నిర్ణయంతో ఏర్పడిన గందరగోళం కారణంగా, భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 25 దేశాలు అమెరికాకు తమ పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ పోస్టల్ యూనియన్ (యూపీయూ) మంగళవారం అధికారికంగా ప్రకటించింది. కొత్త నిబంధనలపై స్పష్టత లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని యూపీయూ పేర్కొంది.

### - అసలు వివాదం ఏంటి?

జులై 30, 2025న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు ఈ సమస్యకు మూలకారణం. ఇప్పటివరకు, 800 డాలర్ల లోపు విలువైన వస్తువులను సుంకం లేకుండా అమెరికాకు పంపే అవకాశం ఉండేది. అయితే, కొత్త ఆదేశాల ప్రకారం ఆగస్టు 29 నుంచి ఈ మినహాయింపును పూర్తిగా రద్దు చేస్తున్నారు. దీంతో, అమెరికాకు వచ్చే ప్రతీ అంతర్జాతీయ పోస్టల్ వస్తువుపై కస్టమ్స్ సుంకాలు వర్తిస్తాయి. అయితే, 100 డాలర్ల లోపు విలువైన ఉత్తరాలు, డాక్యుమెంట్లు, బహుమతులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ కొత్త విధానం ఎలా అమలువుతుంది, సుంకాలను ఎలా వసూలు చేస్తారనే దానిపై అమెరికా కస్టమ్స్ శాఖ నుంచి సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొంది.

### - భారత్ కీలక నిర్ణయం

ఈ నేపథ్యంలో, భారత పోస్టల్ శాఖ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 25 నుంచి అమెరికాకు వెళ్లే అన్ని రకాల పోస్టల్ వస్తువుల బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆగస్టు 23న ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 100 డాలర్ల లోపు విలువైన డాక్యుమెంట్లు, బహుమతులను ప్రస్తుతానికి స్వీకరిస్తున్నా, వాటి రవాణాపై కూడా స్పష్టత లేదని తెలిపింది. ఇప్పటికే పార్శిళ్లు బుక్ చేసి, డెలివరీ కాని వినియోగదారులు తమ పోస్టేజీ రుసుమును తిరిగి పొందవచ్చని సూచించింది. కొత్త నిబంధనల కారణంగా విమానయాన సంస్థలు కూడా ఆగస్టు 25 తర్వాత పోస్టల్ సరుకులను స్వీకరించలేమని చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు.

### -భారత్‌తో పాటు ఇతర దేశాలు కూడా

భారత్‌తో పాటు జర్మనీ, ఫ్రాన్స్, యూనైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఆస్ట్రేలియా, ఇటలీ, స్వీడన్, డెన్మార్క్ వంటి అనేక కీలక దేశాలు కూడా అమెరికాకు పోస్టల్ సేవలను నిలిపివేశాయి. ఫ్రాన్స్‌కు చెందిన 'లా పోస్ట్', యూకేకు చెందిన 'రాయల్ మెయిల్' వంటి సంస్థలు కూడా కొత్త విధానాలకు అనుగుణంగా తమ సిస్టమ్‌లను మార్చుకోవడానికి అమెరికా తగిన సమయం ఇవ్వలేదని ఆరోపించాయి. ఈ నిర్ణయం వల్ల అమెరికాకు ఎగుమతులు చేసే చిన్న వ్యాపారులు, ఈ-కామర్స్ సంస్థలు, సాధారణ ప్రజలు తీవ్రంగా నష్టపోనున్నారు. ప్రస్తుతం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, సమస్యను పరిష్కరించేందుకు అమెరికన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని భారత పోస్టల్ శాఖ అధికారులు తెలిపారు.

# ఏటీఎంలలో రూ.100, రూ.200
# నోట్లు తప్పనిసరి

### – ఏటీఎంలపై బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఏటీఎంలలో రూ. 100, రూ. 200 నోట్లు దొరక్క ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా అన్ని ఏటీఎంలలో ఈ డినామినేషన్ నోట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని బ్యాంకులకు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎదుర్కొంటున్న చిల్లర కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. ఈ సమస్య కారణంగా చాలామంది చిన్న లావాదేవీలకు కూడా యూపీఐ చెల్లింపులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది చిరు వ్యాపారులు, సాధారణ ప్రజలపై ప్రభావం చూపుతోందని గుర్తించిన ఆర్‌బీఐ, ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఈ ఆదేశాల ప్రకారం, ప్రతి ఏటీఎంలో కనీసం ఒక క్యాసెట్‌ను రూ. 100 లేదా రూ. 200 నోట్ల కోసం కేటాయించాలి. ఇందుకు అనుగుణంగా దశలవారీగా మార్పులు చేయాలని బ్యాంకులకు స్పష్టమైన గడువు విధించింది. సెప్టెంబర్ 30 నాటికి దేశంలోని 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంలలో ఈ సౌకర్యం అందుబాటులోకి రావాలని స్పష్టం చేసింది. ఈ మార్పుల కోసం బ్యాంకులు కొత్తగా ఏటీఎం యంత్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఉన్న యంత్రాల సామర్థ్యాన్ని బట్టి వాటిలో చిన్న సర్దుబాట్లు చేస్తే సరిపోతుందని సూచించింది. ఆర్‌బీఐ తాజా ఆదేశాలతో ఇకపై ఏటీఎంలలో చిన్న నోట్ల లభ్యత గణనీయంగా పెరగనుంది.

# లయన్స్ ప్రొఫెషనల్ సభ్యులచే
# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**కాకినాడ** స్థానిక గంగరాజు నగర్ లో లయన్ రవికుమార్ గృహం వద్ద లయన్స్ కాకినాడ ప్రొఫెషనల్ సభ్యుల చే సుమారు ఐదు వందల మట్టి వినాయక విగ్రహాల ను ప్రజలకు అందజేశారు. మోహన్ విద్యాసంస్థల అధినేత లయన్ మోహన్ రావు మాట్లాడుతూ" మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణానికి చాలా మంచివని, ఎందుకంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ఖూఖ) విగ్రహాల వల్ల పర్యావరణం మరియు నీటి వనరులు కలుషితమవుతాయని, ఖూఖ విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయి కాబట్టి, మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు.లయన్స్ క్లబ్ కాకినాడ రూరల్ అధ్యక్షుడు కాకినాడ ఐడిఏ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ"గత తొమ్మిదేళ్ల గా లయన్ రవికుమార్ ప్రతీ వినాయక చవితి కీ ప్రజలందరికీ ఈ మట్టి వినాయక విగ్రహాల ను అందచేయడం ఆయన కు ప్రకృతి పట్ల ఉన్న నిబద్ధత కు అభినందనలని అన్నారు. వినాయక విగ్రహాలు మట్టివి లేదా ప్లాంట్ బేస్డ్? విగ్రహాలు తెచ్చుకుంటే మంచిదని , ప్లాస్టర్? ఆఫ్? పారిస్ నీటిలో కరగదని. కానీ మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోతాయని పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని,అలాగే ప్లాంట్ బేస్డ్ విగ్రహాల్లో విత్తనాలు ఉంటాయి కాబట్టి అవి నీటిలో కరిగకా మొక్కగా పెరిగి పర్యావరణానికి మేలు చేస్తాయని తెలిపారు.ప్లాస్టిక్ డెకరేషన్?కి బదులుగా అరటిఆకులు, పువ్వులతో అందంగా అలంకరణ చేయవచ్చని. పూలతో గుమ్మాలను అలంకరించుకుని,తిరిగి వినియోగించుకోగలిగే క్లాత్ డెకరేషన్ ఐటమ్స్ వాడుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమం లో నిమ్మకాయల వెంకటేశ్వర రావు బి వి ఎన్ రెడ్డి ద్వారంపూడి విపుల్ లయన్స్ సభ్యులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పండిట్ చంద్రగిరి ఎల్లయ్య గంగపుత్రను సత్కరించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర




హైదరాబాద్ (ప్రశ్న )హైదరాబాద్ లోని బీహెచ్ఈఎల్ ఆర్య మందిర్ ను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సందర్శించారు అనంతరము ఆర్య సమాజ్ బీహెచ్ఈఎల్ శాఖ అధ్యక్షుడు పండిట్ చంద్రగిరి ఎల్లయ్య గంగపుత్రను శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ పండిట్ చంద్రగిరి ఎల్లయ్య గంగపుత్ర మొదటి నుంచి ఆర్య సమాజ పద్దతులను ఆచార వ్యవహారాలను అనుచరిస్తూ ఆర్య సమాజ వివాహంలో వివాహా వేద ఆచారాలకు అనుగుణంగా ఇప్పటి వరకు పన్నెడు వందల పై వివాహాలను హిందూ వేదిక పద్దతిలో జరిపించడం అభినందనీయమంటూ ఆర్య సమాజ్ హిందూ సమాజంలో అజ్ఞానం పేదరికం అన్యాయాలను రూపుమాడానికి కృషి చేస్తూ ప్రజలను విజ్ఞాన వంతులుగా చేయడమే ఆర్య సమాజ ముఖ్య ఉద్దేశామన్నారు

## 6 - 10 తరగతుల,ఇంటర్ విద్యార్థుల స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

- ఈనెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ : రఘునాథ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు,ఇంటర్మీడియట్ ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని ప్రిన్సిపాల్ రఘునాథ్ తెలిపారు.దరఖాస్తులను ఈనెల 28 నుండి 30-08-2025 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

**-ప్రత్యేక సౌకర్యాలు:**

- 9వ,10వ తరగతులు, ఇంటర్మీడియట్‌లో చేరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి.
- ఐఐటి,నీట్,క్లాట్,ఇతర పోటీ పరీక్షల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ క్లాసులు
- ఫిజిక్స్ వాలా,ఖాన్ అకాడమీ,అన్అకాడమీ ఆధ్వర్యంలో రోజువారీ తరగతులు
- ఆధునిక పద్ధతులు - ఐ.ఎఫ్.పి.బోర్డ్స్, ప్రొజెక్టర్లు, కె -యాన్ సదుపాయాలు

**దరఖాస్తు విధానం:**

స్పాట్ అడ్మిషన్ కోసం నేరుగా స్కూల్‌లో హాజరై దరఖాస్తు చేసుకోవచ్చని,
మరిన్ని వివరాల కోసం తమను నేరుగా సంప్రదించవచ్చని బోయినిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ / కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథ్ వెల్లడించారు.

## తల్లిదండ్రులు మనకిచ్చిన స్ఫూర్తిని సమాజానికి పంచడమే నిజమైన నివాళి

- విశ్రాంత ఎం.ఈ.ఓ. : చెన్నమాధవుని రామరాజు
- పితృ స్మరణలో రామరాజు అన్నదాన సేవా కార్యక్రమాలు
- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మందికి అన్నదానం



బోయినిపల్లి / వేములవాడ (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ మండల విద్యాధికారి,సేవామూర్తి చెన్నమాధవుని రామరాజు మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. కీర్తిశేషులైన తన తండ్రి చెన్నమాధవుని చంద్రయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం వేములవాడ పట్టణంలో విశిష్టమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో సుమారు 150 మంది అన్నార్థులకు అన్నదాన సేవా కార్యక్రమాలను అందించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భోజన ఏర్పాట్లు చేసి అందరికి సమృద్ధిగా భోజనం పెట్టారు.ఈ కార్యక్రమంలో రామరాజు సతీమణి లక్ష్మీ పాల్గొని వర్ధంతి నేపథ్యంలో అన్నదాన సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను తెలియజేశారు.ఈ నేపథ్యంలో చెన్నమాధవుని రామరాజు మాట్లాడుతూ, "మన తల్లిదండ్రులు మనకు ఇచ్చిన విలువలు,స్ఫూర్తిని సమాజానికి పంచడమే నిజమైన నివాళి. ఇదే నా తండ్రి ఆత్మకు శాంతి కలిగించే మార్గం" అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్, తదితర ట్రస్ట్ సభ్యులు, అన్నార్థులు,స్థానికులు రామరాజు సేవా భావాన్ని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి విలువలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.

## రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగలు



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లాలో ధర్పల్లి మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ధర్పల్లి గ్రామ శివారు ఇందల్వాయి రోడ్డు లో గల ఇంద్ర గౌడ్ మాముళ్ళ ఏరియాలో రోడ్డుకు గల భాష్యం సందీప్, తనుగుల విజయ్, మల్లరి శ్రీనివాస్లకు చెందిన మూడు ట్రాన్స్ఫర్లను పగలగొట్టి అందులోని కాపర్ కాయలను దొంగలు ఎత్తుకుపోయినట్టు ధర్పల్లి విద్యుత్ ఏఇ కె నాగేశ్వరరావు ధర్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. దరఖాస్తు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు ధర్పల్లి ఎస్సై కళ్యాణి తెలిపారు.

## చెడు వ్యసనాలను నివారించే దిశగా యువత అభ్యుదయానికి కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్ : కోరెపు నరేష్
- బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ కు కాంగ్రెస్ నేతల సన్మానం - శుభాకాంక్షలు




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి,శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,మల్కాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కోరెపు నరేష్,తడగొండ మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్,మండల అధికార ప్రతినిధి మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోరెపు నరేష్ మాట్లాడుతూ, "గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటంలో, నేరాలను అరికట్టటంలో ఎస్ఐ రమాకాంత్ పాత్ర కీలకం. ముఖ్యంగా యువతను సత్సంప్రదాయాల వైపు దారి మళ్లించి,చెడు వ్యసనాలను నివారించే దిశగా వారి అభ్యుదయానికి కృషి చేయాలని మేము ఆశిస్తున్నాము. ప్రజలతో అనుబంధాన్ని పెంపొందించి అందరికీ అందుబాటులో ఉండేలా పని చేయాలి" అని ఆకాంక్షించారు.

## మట్టి గణపతులనే ఆరాధించండి - పర్యావరణాన్ని కాపాడండి

- జిల్లా ప్రజలకు " వినాయక చవితి పండుగ" శుభాకాంక్షలు
- భాజపా సీనియర్ జిల్లా నాయకులు : అనుమల్ల చంద్రమౌళి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) వినాయక చవితి పర్వదినం సందర్భంగా భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు,భాజపా చేనేత సెల్ మాజీ జిల్లాధ్యక్షులు అనుమల్ల చంద్రమౌళి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వినాయక చవితి మనకు ఏకత్వం, శుభప్రారంభానికి ప్రతీక. ప్రతి ఇంటిలో విఘ్నేశ్వరుని పూజించడం ద్వారా విజయం సాధించగలమనే విశ్వాసం కలుగుతుంది" అన్నారు.అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, "రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నదులు, చెరువులు కలుషితం అవుతున్నాయి. కాబట్టి ఈ పండుగలో మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించి ఆరాధిద్దాం. ఇది పర్యావరణానికి మేలు చేస్తుంది" అని పిలుపునిచ్చారు. "ప్రకృతిని కాపాడండి – మట్టి గణపతులనే పూజించండి" అని ఆయన సందేశమిచ్చారు.

## పెళ్లి మండపంలో పంచుముఖ విఘ్నేశ్వరుడు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో కైకాల సత్రం 14 గ్రామాలకు చెందినోలు పెళ్లి మండపంలో భారీ గణపతి పంచముఖేశ్వర మండపంలో ప్రెసిడెంట్ ఓబ్బు మధుసూదన్ మరియు కమిటీ నెంబర్ భారీ గణపతి పెళ్లి మండపం వద్ద భక్తులకి కనువిందు చేసినారు.జై బోలో గణేష్ మహారాజ్ కీ జై.వినాయక చవితి వేడుకలు సమీపిస్తుండడంతో పూజలందుకోవడానికి గణనాథులు సిద్ధమవుతున్నారు.వినాయక చవితి అంటే పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన వినాయకుడి జననం జరిగిన రోజు. భాద్రపద మాసంలోని శుక్ల పక్ష చవితి రోజున వినాయక చవితి పండగను జరుపుకుంటారు ఈ రోజున గణపతిని 21 రకాల పత్రాలతో శివపార్వతుల కుమారుడైన వినాయకుడిని విఘ్నాలకు అధిపతిగా,జ్ఞానానికి ప్రతీకగా భావిస్తారు, ఈరోజు ఏకదంతుణ్ణి ఆకులతో పూజిస్తే విఘ్నాలు తొలగి కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు.వినాయక చవితి రోజున గణపతికి ఇష్టమైన ఉండ్రాళ్లు, మోదకాలు వంటి నైవేద్యాలు సమర్పిస్తారు. వినాయక చవితి కోసం గణపతి విగ్రహాల తయారీ దేశవ్యాప్తంగా,ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ వంటి రాష్ట్రాలలో విగ్రహాలు సిద్ధమయ్యాయి దీనితో పాటు పండుగకు సంబంధించిన పూజా సామాగ్రి సేకరణ, దేవాలయాల అలంకరణ వంటి పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి 2025లో ఈ పండుగ ఆగష్టు 27న ప్రారంభమవుతుంది, వివిధ నగరాల్లో భారీ,సృజనాత్మక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు భక్తులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

## ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనికిలు డీ.ఏ.వో ప్రసాద్ రావు





శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు ఆకస్మిక తనిఖీలు మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ఎరువులు పక్క దారి పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయించ రాదన్నారు. అనంతరం దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డివిజన్ ఏ డి ఏ (పి పి), డి ఎ వో ఆఫీస్ తిరుపతి ధనంజయ రెడ్డి,ఏడిఏ రమేష్ రెడ్డి,రెండో పట్టణ సీఐ నాగార్జున రెడ్డి, ఏవో మమతారెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కూకట్ పల్లి (ప్రశ్నన్యూస్) ప్రశాంత్ నగర్ ఐడిఏ, రాజీవ్ గాంధీ నగర్, శ్రీ శ్రీ నగర్ వంటి కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఈ సమస్యకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ ఫారూఖీ చొరవతో సుమారు 2 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులను సోమవారం ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలోని 33/11 కేవీ సబ్-స్టేషన్‌లో కొత్తగా 16 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డీఈ బోయిన్పల్లి గోపాలరావు ఇచ్చిన సమాచారం మేరకు, ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వల్ల వేలాది మంది ప్రజలకు, వ్యాపార సంస్థలకు నిరంతరాయంగా, స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. సబ్-స్టేషన్ అప్‌గ్రేడ్ కార్యక్రమానికి ఎస్ఈ సికింద్రాబాద్ గోపయ్య, ఎస్ఈ స్కాడా సర్కిల్ దిలీప్‌కుమార్, డీఈ బోయిన్పల్లి గోపాలరావు, ఏడిఈ రంగారెడ్డి సతీష్ బాబు, డీఈ లైన్లు, డీఈ ఎంఆర్టీ, ఏడీలు, ఐడీపీఎల్ ఏఈలు, ఇంజనీర్లు, సిబ్బంది హాజరయ్యారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడంలో ఈ అప్‌గ్రేడ్ ఒక కీలక అడుగు అని ఏఈ అక్బర్ పేర్కొన్నారు.

## పిఓపి తో గణపతి ని చేస్తే అనర్థాలే ఎక్కువ



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఆదర్శ పాఠశాల ధర్పల్లి నందు ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంలో పాఠశాల



పిల్లలందరూ వారి యొక్క చిట్టి చిట్టి హస్తాలతో మట్టి పిసికి వినాయక విగ్రహాలను తయారు చేసి వాటిని భక్తులకు పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పిఓపి) వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు మట్టి ప్రతిమల వల్ల కలిగేటువంటి లాభాలను సమాజానికి చాటి చెప్పే విధంగా వారు వినాయక విగ్రహ రూప కల్పన చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అందరు తమవంతు బాధ్యతగా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. పాఠశాల లోని ఉపాధ్యాయులు కూడా భాగస్వాములయ్యారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించినటువంటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మట్టి వినాయకుల వల్ల కలిగేటువంటి లాభాలను వాటి యొక్క ప్రయోజనాలను అదేవిధంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించి చెప్పడం జరిగింది.

## రూరల్ పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పి అశోక్ కుమార్

-డిఎస్పీ రఘుచందర్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రూరల్ సి ఐ సుధాకర్, ఎస్సైలు సధాకర్, సుధీర్ రావు,గీత, రాజు



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం రికార్డు , ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు.సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్, ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు.ఎస్ ఓ పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. 5 యస్ ఇంప్లిమెంటేషన్ ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని,5 యస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని సూచించారు.సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయా ఎస్సై ల ద్వారా చర్యలు తీసుకోవాలని రూరల్ సి .ఐ సుధాకర్ కి సూచించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు.ఈ సందర్భంగా సర్కిల్ ఆఫీస్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఎస్పీ రఘు చందర్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్, ఎస్సైలు సధాకర్, సుధీర్ రావు,గీత,రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఫీస్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ చాంపియన్స్ గా నిలవాలి...జంపన ప్రతాప్



బోయినపల్లి (ప్రశ్న న్యూస్) ఈ నెల 28 నుండి 30 వ తేదీ వరకు చెన్నై దుండిగల్ లో జరిగే 12 వ సీనియర్ నేషనల్ ఫిస్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటిల్లో తెలంగాణ జట్టు ఘన విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకోవాలని ఫిస్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ జంపన ప్రతాప్ కోరారు. న్యూ బోయిన్ పల్లి ప్లే గ్రౌండ్ లో ఫిస్ట్ బాల్ బాలుర, బాలికల జట్ల క్రీడాకారులను పరిచయం చేసకొని వారికీ టీ షర్ట్స్,.షార్ట్స్, టీమ్ కిట్లను జంపన ప్రతాప్ అందజేశారు. క్రీడా పోటీల్లో గెలుపు ,ఓటములు సహజమని ప్రతిఒక్కరు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఫిస్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్ము వెంకట్, గౌరవ అధ్యక్షులు స్నేహ, జనరల్ సెక్రటరీ ప్రభుకుమార్ గౌడ్, కోశాధికారి జైరాజ్ తో పాటు తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా సంక్షోభం

### - బత్తిని మహేందర్ యాదవ్ వినతి

**- యూరియా సమస్యపై బండి సంజయ్ జోక్యాన్ని కోరిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు

ఎదుర్కొంటున్నారని,ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతాంగానికి అవసరమైన యూరియా బస్తాలను తక్షణం సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తిని మహేందర్ యాదవ్ మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ, "సీజన్ మొదలైందని, పంటలు చేతిలో ఉన్నాయని, కానీ యూరియా దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని యూరియా సరఫరా చర్యలు తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు.

## టీకాలతో ఆరోగ్య రక్షణ

**హైదరాబాద్ :** జైడస్ లైఫ్ సైన్సెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆధునికీకరించిన ఇన్ఫ్లుయెంజా టీకా మార్గదర్శకాలపై హైదరాబాద్ బంజారాహిల్స్ లోని లీలా హోటల్లో 'ది చేంజింగ్ ఫేస్ ఆఫ్ ఇన్ఫ్లుయెంజా ఈజ్ ఇండియా రెడీ టు కోప్ విత్ ఇట్' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్ ఫ్లుయంజా వైరస్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఏడాది ఒక సారి టీకాలు వేయించుకోవాలని వైద్యులు తెలిపారు. జైడస్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఇంఫ్లుయంజా వైరస్ లక్షణాలు,ఎలా వ్యాపిస్తుంది...రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. గర్భస్థ మహిళలు టీకా వేయించుకోవడం ద్వారా తల్లి పుట్లబోయే పిల్లలు ఫ్లూ బారిన పడకుండా కాపాడుకోవచ్చని గైనకాలజిస్ట్ త్రిపుర సుందరి తెలిపారు . ఇంఫ్లుయంజా వైరస్ పై ప్రజల్లో మరింత అవగాగహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు .

## మహోన్నత మానవతావాది మదర్ థెరెస్సా

**సికింద్రాబాద్ కంటోన్మెంట్** కరుణ, ప్రేమ, సేవ వంటి మానవత్వపు సహజ గుణాలు సమాజానికి ఎల్లప్పుడూ అవసరమని తన జీవితం ద్వారా తెలియజెప్పిన మహోన్నత మానవతావాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరెసా జయంతి సందర్భంగా సికింద్రాబాద్ మోండా డివిజన్ లోని మదర్ థెరీసా విగ్రహానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పూలమాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించి వారి సేవా నిరతిని కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్ యాదవ్ బద్రీనాథ్ యాదవ్ టెంపుల్ కమిటీ చైర్మన్ లు అరవింద్ యాదవ్, నాయకులు నంది కంటి రవి, వెంకట్ రాజు శ్రీనాథ్ శేఖర్ ముదిరాజ్, ధనలక్ష్మి వరలక్ష్మి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**కాణిపాకం** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యింది .. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు 21 రోజుల పాటు జరగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకుగాను ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఆలయం రంగులతో హంగులు దిద్దుకుంది.. తమిళనాడు ,కర్ణాటక , తెలుగు రాష్ట్రాల నుండి కాణిపాకం వరసిద్ధిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిమంది రానున్నారని భక్తులను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.. ఈ సందర్భంగా ఆలయ ఈవో పెంచల కిషోర్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన వినాయక చవితి రోజున వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు, భక్తులకు లడ్డు తీర్థప్రసాదాలను అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు... సామాన్య భక్తుడిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది అన్నారు... ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు . బ్రహ్మోత్సవం సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు....అలాగే అన్నదానం నూతన భవనం ప్రారంభిస్తారని పేర్కొన్నారు... ధ్వజ అవరోహణంతో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నారు.. కావున భక్తులు తరలివచ్చి స్వామివారి ని దర్శించుకుని పునీతులు కావాలని ఆయన కోరారు.

# హ్యాండ్లూమ్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి

**- దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం**
**- చేనేత కార్మికులకు ఉపాధి - సిరిసిల్ల పరిశ్రమకు భారీ ఆర్డర్లు**
**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థికాభివృద్ధి దిశగా సంక్షేమ పథకాలు అమలు**
**- మంత్రి : అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- రాజన్న సిరిసిల్ల జిల్లాను అభివృద్ధి చేయడంలో ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది - ఆది శ్రీనివాస్**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నాం" అన్నారు.

### - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలు:

- త్వరలో రూ.33 కోట్ల చేనేత రుణాలు మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు.
- నేతన్న చేయూత, నేతన్న పొదుపు, నేతన్న బీమా బకాయిలు చెల్లిస్తున్నామని తెలిపారు.
- వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు డిపో ద్వారా 2,500 మెట్రిక్ టన్నుల నూలు 100 సొసైటీలకు సరఫరా చేశామని వివరించారు.
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక్కో హామీని అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.6,680 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.
- 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ రూ.500కి అందిస్తున్నామని చెప్పారు.
- రూ.2 లక్షల రైతు రుణ మాఫీ పూర్తి చేసి, 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని వెల్లడించారు.
- చేనేత రంగం అభివృద్ధికి హ్యాండ్లూమ్ యూనివర్సిటీ ఏర్పాటు కృషిలో ఉందని తెలిపారు.



- స్వశక్తి మహిళా సంఘాలకు నాణ్యమైన చీరల ఉత్పత్తికి భారీ ఆర్డర్లు ఇస్తున్నామని తెలిపారు.

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యలు:

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రేషన్ ద్వారా సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ రూ.500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల వంటి పథకాలను ప్రస్తావించారు. విద్యపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు.

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు:

రాజన్న సిరిసిల్ల జిల్లాను అభివృద్ధి చేయడంలో ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు 352 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేశారని, 270 కోట్ల రూపాయల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు.

### కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు

బతుకమ్మ చీరల బకాయిలు రూ.350 కోట్లను విడుదల చేశామని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పెద్ద ఆర్డర్లు ఇచ్చి మహిళలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు.

### - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యాఖ్యలు

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 4,963 మంది నేత కార్మికులకు నేతన్న పొదుపు కింద రూ.24.80 కోట్లు పంపిణీ చేస్తున్నామని, నేతన్న బీమా కింద 12 కుటుంబాలకు పరిహారం అందిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, చేనేత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, చేనేత శాఖ జేడీ ఎస్వీ రావు, ఏడీ రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, నేత కార్మికులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకై ఏకమవుదాం - లాయక్ పాషా

**- అక్రిడిటేషన్ కార్డుల పొడగింపు విధానానికి స్వస్తి**
**- కొత్త కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలి**
**- జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, నివాస స్థలాలు అందించాలని డిమాండ్**





గంభీరావుపేట (ప్రశ్న న్యూస్) తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె హెచ్-143), ఎలక్ట్రానిక్ మీడియా వింగ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం,నర్మాల గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం సంఘబలం అవసరమని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అక్రిడిటేషన్ కార్డుల పొడగింపు ప్రక్రియను నిలిపివేసి, కొత్త కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి నూతన కార్డులు మంజూరు చేయాలి. ప్రభుత్వం ఇప్పటివరకు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం బాధాకరం. వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన ప్రతి జర్నలిస్టుకు నివాస స్థలాలను కేటాయించాలని ప్రభుత్వం కోరారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘాన్ని మండల స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు సామల గట్టు, మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, పరశురాం, అనిల్ కుమార్, కోశాధికారులు అందే దేవేందర్, సయ్యద్ ఖలీమ్, కార్యదర్శులు షేక్ రియాజ్, బాలరాజు, మోహన్, సలావుద్దీన్, శేఖర్ రెడ్డి, పంజా సంపత్ కుమార్, బాబు, అరిగే రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఘన సన్మానం జరిగింది.

## టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో ఐఏఎస్ శ్రీలక్ష్మి హస్తం

**తిరుపతి** టిడిఅర్ బాండ్ల కుంభకోణం వెనుక ఉంది ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి ఉందని మాజీ టీడీపీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు.

మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. శ్రీలక్ష్మి పేరు చెప్పకుండా అయన పరోక్షంగా ప్రస్తావించారు. ఆమె అధునిక రజియా సుల్తానా. యాభై వేల చీర దరిస్తుందంటున్నారు. 50లక్షల విలువైన 11విగ్గులు ఉన్నాయని రోజుకొకటి దరిస్తుందని భూమన అన్నారు. టిడిపి నాయుకునితో అంటకాగి మచ్చలేని నా పై అరోపణలు చేసింది. గతంలో అమెపై భూ దోపిడి అరోపణలున్నాయి. టిడిఅర్ బాండ్ల పై వైసిపి ప్రభుత్వములో శ్రీలక్ష్మి విచరాణకు ఆదేశించారని అయన అన్నారు

## కాణిపాకంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి

**కాణిపాకం** ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

దేవస్థానం ఈవో పెంచల కిషోర్ సూచనల మేరకు ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లను, పార్కింగ్ కేంద్రాలను, లడ్డు విక్రయ సెంటర్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టారు.

తిరుపతి,చిత్తూరు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల సౌకర్యాలను కల్పించారు. ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా లక్ష మంది పైచిలుకు భక్తులు రానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లు సైతం పూర్తిస్థాయిలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ సూచనల మేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలియజేశారు.. ..

## సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల జీతాల బాకీలు వెంటనే చెల్లించాలి

### మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**పోలవరం** సత్య సాయి మంచినీటి పథకం కార్మికులకు 10 నెలలుగా రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గత ప్రభుత్వంలో ఈ సమస్యను జగన్ కి తెలియజేయగా తక్షణమే 13 కోట్లు మెయింటెనెన్స్ ఖర్చుకు సాంక్షన్ చేశారని ఆయన అన్నారు.

17 మండలాలకు సుమారు ఆరు లక్షల మందికి ఈ మంచినీటి పథకం ఉపయోగపడుతుంది తక్షణమే కార్మికులకు జీతాలు విడుదల చేయని పక్షాన కార్మికుల మద్దతుగా తాను ఆందోళన చేపడతానని మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు గారు హెచ్చరించారు.

## గ్రేటర్ అభివృద్ధి ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్** హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నగర్ మాజీ డిప్యూటీ మేయర్.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుభాష్ చందర్జీ విమర్శించారు. గతంలో బీఆర్ ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాల పుణ్యమా అని గ్రేటర్ సమస్యలతో విలవిలలాడుతోందన్నారు. సైదాబాద్ లో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్లోని ప్రజా సమస్యలు, నగర అభివృద్ధి అంశాలపై భాజపా ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన చేపడితే, రాష్ట్ర ప్రభుత్వానికి భయం ఎందుకని ప్రశ్నించారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతోపాటు నాయకులను అరెస్టులు, హౌస్ అరెస్టులు చేయడం అప్రజాస్వామిక మని ఆగ్రహం వ్యక్తం చేశారు. "హైదరాబాద్ అంటే హైటెక్ సి గచ్చిబౌలి మాత్రమే కాదు. అసలైన హైదరాబాద్ అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారమున్న చోటే ప్రభుత్వం ఖర్చు చేస్తోందని ఆరోపించారు. నేడు రాజధానిలో ఏ ప్రధాన రహదారిపైకెళ్లి చూసినా వీధి దీపాలు కనిపించవు. రాష్ట్ర ప్రభుత్వం వీధి దీపాలు కొనలేని దుస్థితిలో ఉందన్నారు.. నగరంలో మౌలి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కదా ప్రశ్నించారు. బీజేపీ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు

## నాచారంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ

**మేడ్చల్** నాచారంలోని శ్రీ మహాకాళి సహిత మహా కాలేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఎస్ఎస్ఎస్ యువసేన, యూత్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మట్టి గణపతులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మట్టి గణపతి పంపిణీ చేస్తున్నట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కు పాటుపడాలని, వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా వేడుకలు జరుపుకోవాలని ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి సూచించారు.

## మణికొండ ఆర్టీయే కార్యాయలంలో ఇంటర్నెట్ ఇబ్బందులు

**రంగారెడ్డి** మణికొండ రవాణ శాఖ కార్యాలయంలో రెండు రోజులుగా సేవలు స్థంభించిపోయాయి. ఇంటర్నెట్ సేవలు రాకపోవడంతో మణికొండ ఆర్టీవో కార్యాలయాన్ని అధికారులు మూసివేసారు. ఇంటర్నెట్ సదుపాయాలు వచ్చిన తర్వాతే స్లాట్ బుకింగ్ చేసుకోవాలని వాహనదారులకు సూచిస్తూ గేటు బయట నోటీసు పెట్టారు.

విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో, ఐదు కిలోమటర్ల మేర విద్యుత్ స్తంబాలకు ఉన్న కేబుల్స్ లను విద్యుత్ అధికారులు కట్ చేసారు. దాంతో ఆర్టీఏ కార్యాలయానికి ఇంటర్నెట్ కట్ అయింది. సేవలు బంద్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## నిమ్స్ సిబ్బంది పిల్లల కోసం క్రష్, ప్లే స్కూల్

**హైదరాబాద్:** నిమ్స్ హాస్పిటల్ ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రష్ ప్లే స్కూల్ను రోటరీ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ రామచంద్ర మాట్లాడుతూ, ఉద్యోగులు విధుల్లో నిమగ్నమై ఉండే సమయంలో తమ పిల్లలను సురక్షితంగా ఈ క్రష్లో వదిలి ప్రశాంతంగా పని చేయవచ్చని తెలిపారు.పిల్లల కోసం అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించినట్లు ఆయన చెప్పారు. హాస్పిటల్ సిబ్బంది పిల్లల సంరక్షణతో పాటు అభివృద్ధికి అనుకూలంగా ఉండే వాతావరణాన్ని ఈ క్రష్లో ఏర్పాటు చేసినట్లు రామచంద్ర పేర్కొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో చేరిన
# 20 వైసీపీ కుటుంబాలు



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం లోని అట్లూరు మండలం కుంభగిరి పంచాయతీకి చెందిన వైసీపీ ఎంపీటీసీ చిన్న ,వార్డు మెంబర్ జయన్న మలినేనిపట్నం కాలనీకి చెందిన మరో 20 కుటుంబాలు బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి పసుపు కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో పనిచేయాలని రితేష్ రెడ్డి ప్రోత్సాహంతో తెలుగుదేశం పార్టీలో చేరామన్నారు. రితేష్ రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు నాయకత్వం అవసరమని అవినీతి అక్రమాల వైసిపి పార్టీలో కొనసాగుతున్న నిజాయితీ పరులైన కార్యకర్తలను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షించే వారందరూ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం





**తిరుపతి** తిరుపతిలోని మాహతి ఆడిటోరియంలో టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఆర్. కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో 87వ వార్షిక నివేదిక సమర్పించబడింది. ఆర్థిక సంవత్సరం 2024-2025 ఆడిట్ రిపోర్టును ఆమోదించి, సొసైటీ సాధించిన నికర లాభం రూ. 8.66 కోట్లలో నుంచి సభ్యుల పెట్టుబడిపై 15.5% డివిడెండ్గా రూ. 4.33 కోట్లు చెల్లించాలని నిర్ణయించారు. సమావేశంలో, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న టైమ్ స్కేల్ ఉద్యోగి సర్వీస్ను క్రమబద్ధీకరించడానికి, అలాగే సభ్యులకు దీపావళి కానుకగా రూ. 500 గిఫ్ట్లు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. మరణించిన సభ్యుల ఇన్సూరెన్స్ మొత్తాన్ని రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. గతంలో జరిగిన నియామకాలపై తగిన చర్యలు తీసుకోవాలని, జనరల్ బాడీ అనుమతి లేకుండా చెల్లించిన రూ. 10 లక్షలను రికవరీ చేయాలని తీర్మానించారు. బ్యాంక్ కార్యకలాపాలను పటిష్టం చేయడానికి మరియు అవకతవకలను నివారించడానికి ఒక "సూపర్ వైసరీ కౌన్సిల్" ఏర్పాటు చేయాలని, అలాగే రిటైర్డ్ ఏఈఓ/ ఏఏఓ లేదా సూపరింటెండెంట్ స్థాయి అధికారిని అడిషనల్ ఛార్జ్తో నియమించాలని నిర్ణయించారు. ఎస్వీఐఎంఎస్ ఉద్యోగులకు ఇచ్చిన సభ్యత్వంలో ఉన్న చట్టపరమైన లోపాలను సవరించి, సహకార శాఖ ఆమోదం కొరకు పంపాలని ఆమోదించబడింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి, డైరెక్టర్లు మరియు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## నరసరావుపేటలో మదర్ థెరిసా జయంతి వేడుకలు



**నరసరావుపేట :** సేవకు ప్రతిరూపంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సెయింట్ మదర్ థెరిసా జయంతి వేడుకలు పల్నాడు రోడ్డులో గల విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హాజరై, మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా మానవ సేవలకు చిహ్నంగా నిలిచిన మదర్ థెరిసా జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, సేవా సంస్థల ప్రతినిధులు, రాజకీయ వర్గాల నుంచి విస్తృత మందం పాల్గొన్నారు. మదర్ థెరిసా తన జీవితకాలంలో 1979లో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు, మరియు 2016లో భారత రత్న గౌరవాన్ని పొందారు. ఆమె స్థాపించిన మిషనరీస్ ఆఫ్ చారిటీ సంస్థ ద్వారా లక్షలాది మంది నిరుపేదలు, రోగులు, అనాథలకు సేవలందించారు. ఆమె సేవలు ప్రపంచవ్యాప్తంగా 123కి పైగా దేశాల్లో విస్తరించాయి, మరియు ఆమె ద్వారా 4 వేలకి పైగా మిషనరీలు పనిచేస్తున్నాయి అన్నారు. మదర్ థెరిసా చేసిన మానవతా సేవలను స్మరించుకోవడం సమాజానికి ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. మదర్ థెరిసా, మానవ సేవే మాధవ సేవ అనే సూత్రాన్ని పాటించి, నిస్సహాయులకు, నిరుపేదలకు ప్రేమామృతాన్ని పంచారు. ఆమె జీవితం మనకు సేవా భావాన్ని చాటుకుంటుంది. మన ప్రాంతంలోని ప్రజలు ఆమె సేవా ఆదర్శాన్ని అనుసరించి, స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుండాలి అని ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వం నిలుపుకో ఇది పుస్తకం కాదు జీవితం




నేటి కాలంలో మనం ఎదైనా సినిమాకు వెళ్ళామంటే అందులో నిండుగా హత్యాలు అత్యాచారాలు క్లుప్తంగా కనిపిస్తాయి. అందుకే చాలా మంది సినిమా ప్రీయులు కాస్త పుస్తక ప్రీయులుగా మారుతున్నారు. మారాలి కూడా. అప్పుడే కదా మనకు మంచి కొంతైనా తెలుస్తోంది. సాదారణంగా పుస్తకాల్లో కూడా అప్పుడప్పుడు క్రైము పుస్తకాలు ఉంటాయి. కొన్ని పుస్తకాలు మాత్రమే క్రైమ్ ని కూడా హస్యంలా కనిపించేలా చేస్తాయి. అలాంటి పుస్తకమే ఇప్పుడు నేను పరిచయం చేసే పుస్తకం మానవత్వం నిలుపుకో అనే ఈ పుస్తకాన్ని కవి, రచయిత డా. వి.డి. రాజగోపాల్ రాశారు. ఈ పుస్తకంలో నాలుగు నవలికలు ఉన్నాయి. అందులో నేటి సమాజంలో ఆడపిల్ల, హృదయ కుసుమం, అరకు వెళ్లే రైలుబండి, మల్లెతీగకు పందిరి తోడైతే అనే నాలుగు నవలికలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందామా మరి.

### నేటి సమాజంలో ఆడపిల్ల

నేటి సమాజంలో ఆడపిల్ల ఎలా ఉన్నా కష్టాలు మాత్రం నేనున్నాయంటు పలుకరిస్తూనే ఉంటాయి. అలాగే ఈ కథలో ప్రణవి చాలా కష్టపడుతూ ఫ్యామిలీని నడుపుతూ ఉంటుంది. ఓ వైపు చదువు మరోవైపు ఉద్యోగం బాధ్యతగా నిర్వహిస్తుంది. ఆడపిల్లకి శత్రువు అందమే. అమ్మాయి అనుకువగా ఉంటే మురులు వదలరు. కాస్తా మాస్గా ఉంటే ప్రజలు వదలరు. ఆడపిల్ల బతుకే అంతా.. అలాంటిదే ఈ కథ. ప్రణవి మధ్యతరగతికి చెందిన అమ్మాయి. ఉద్యోగం చేసే చోట యజమాని కొడుకుతో కొన్ని సమస్యలు ఎదుర్కోంటుంది. ఆ సమయంలో ప్రణవికి తోడుగా కాబోయే భర్త రాజేష్ ఆమెని నమ్మి తన నిజాయితీకి తోడుగా నిలిచి కష్ట సమయంలో వెన్నంటి ఉండి ఆమెను కష్టం నుంచి గట్టెక్కించి పెళ్లి చేసుకుని వారి కుటుంబ సమస్యలను కూడా తీరుస్తాడు. స్త్రీకి పుట్టింటి కన్న మెట్టినిల్లే

ఎక్కువ నమ్మకంగా ధైర్యంగా ఉండాలి అప్పుడే ఎంతటి కష్టానైనా తెలికగా గట్టెక్కగలదు. ఈ కథలో ప్రణవీ అత్తారిల్లు వెన్నంటి ఉండి ధైర్యంతో ముందుకు సాగనిచ్చి గెలుపును అందిస్తారు. ఈ కథలో ప్రణవిని అర్థం చేసుకునే మెట్టినింటి కుటుంబ సభ్యుల తీరు. ప్రణవి నిజాయితిని గుర్తించిన ఉద్యోగ యజమానితీరు బాగుంటుంది. నేటి కలంలో తప్పు చేసిన కొడుకులను వేనుకేసుకోస్తున్న తల్లులకు, కోడలంటే పనిమనిషి కన్న ఘోరమని భావించే మెట్టినింటి వాళ్లకి, జీవితాన్ని పంచుకునే భాగస్వాములకు, గడి తప్పిన నేటి ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతోంది.

### హృదయ కుసుమం

ఈ కథ ఓ ఉద్యోగికి యజమానికి మధ్యలో సాగిన కథ. ఈ కథలో రచయిత కోర్టు చట్టాల గురించి అవగాహన తెచ్చారు. అంతేకాదు మనం చేసే పనిలో మంచి ఉంటే ఎక్కడైన మంచే జరుగుతుందని చెప్పారు. ఈ కథలో శ్రావణ్ మంచి ఉద్యోగి తనకి ఓ ఆఫర్ వస్తుంది. అప్పటికే శ్రావణ్ ప్రభుత్వ ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తుంటాడు. అక్కడ అనుకోకుండా నింద పడడంతో నిరుత్సాహపడి పోయి.. తనకు వచ్చిన ఆఫర్ కోసం మేనమామతో చర్చించి ప్రభుత్వ ఉద్యోగం కాదని ప్రయివేట్ ఉద్యోగం చేస్తాడు. అక్కడితో అగకుండా అంచలంచెలుగా ఎదిగుతాడు అతని మంచి తనానికి శ్రావణ్ యజమానియే మేనమామ కూతురితో పెళ్ళి చేస్తాడు. అలా ఆ బంధం గట్టిపడుతోంది. శ్రావణ్ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి యాజమానికి నచ్చుతాడు. సంసారం, స్నేహం వ్యాపారం ఏదైనా వృద్ధి చెందాలి అంటే నమ్మకమే బలమైనది. ఆ నమ్మకం ఉంటే ఎప్పుడూ ఇద్దరి మధ్యలో గొడవలు రావు. ఈ కథలో యజమాని రంగారాంకి శ్రావణ్ పై మంచి నమ్మకం ఉంటుంది. చివరి వరకు శ్రావణ్ ని నమ్మడమే సాగుతోంది. శ్రావణ్ కూడా యజమాని నమ్మకాన్ని ఎక్కడా వమ్ముపాలు చేయ్యడు. ఈ కథ వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు, ఉద్యోగాల్లో మోసపోయేవారికి చక్కగా సరిపోతుంది.

### అరకు వెళ్లే రైలుబండి

సాదారణంగా ప్రయాణాలు అంటే అందరికీ ఇష్టం. చాలా మందికి ప్రయాణాలు చేస్తుంటే ఏదో తెలియనిది ఎవ్వరూ గమనించనిది కనబడుతుంది. ఆకర్షిస్తుంది. ఒక్కసారి ఆకర్షిస్తే మళ్లీ మళ్లీ అది చూడాలని మనస్సు తపిస్తుంది. అరకు వెళ్లే రైలు బండిలో కథలో కూడా ఓ ప్రదేశం కథానాయకుడు సాగర్ కు బాగా నచ్చుతుంది. సామన్యంగా అందరూ అరకు వెళ్లినప్పుడూ గుహల్లో రైలు ప్రయాణించడమే చూస్తాం. ఈ కథలో సాగర్ మాత్రం ఓ కుటుంబాన్ని చూస్తాడు. అది ఓ రైల్వేగేట్ మ్యాన్ కుటుంబం ఎలాగైనా ఓసారి ఆ కుటుంబాని కలవాలనే కోరికతో ఉంటాడు సాగర్. కోరిక బలమైనదేతే.. నెరవేరుతోంది అన్నది వాస్తవం. అలాగే సాగర్ కూడా ఆ కుటుంబంతో కలుస్తాడు. ప్రేమ నిజమైనదైనప్పుడు ప్రేమించిన వారికోసం ఎక్కడి దాకైనా వెళ్లడానికి ముందుటాం. అలాంటి కథే ఈ కథ. ఈ కథలో సాగర్ ప్రేమించిన గేట్ మ్యాన్ కూతురు సొంతకూతురు కాదని తెలుసుకుని ఆమెని తన సొంత కుటుంబంతో కలిపి. నచ్చిన అమ్మాయితో పెళ్లి చేసుకునే అవకాశం కల్పించిన గెట్ మ్యాన్ కి మంచి లైఫ్ ఇవ్వడమే కాకుండా తను చూసిన ప్రదేశాన్ని కాస్తా ఓ ఊరులా మారుస్తాడు. నిజమైన ప్రేమ ఏమైనా చేస్తుంది. ఈ కథలో పొందిన మేలు మరిచిపోకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. డబ్బు ఉన్న వారు డబ్బున్న వారినే కాకుండా మనస్సున్న వారిని ప్రేమిస్తే బాగుంటుందనేలా కథ సారాంశం ఉంది.

### మల్లెతీగకు పందిరి తోడైతే

ఇంతకు ముందే చెప్పాను. ఆడపిల్లకు పుట్టినింటి కన్న మెట్టినిల్లే ఎక్కువగా నమ్మకంగా ఉండాలి అని. అలాంటి మరో కథే మల్లెతీగకు పందిరి తోడైతే.. ఈ కథ కూడా ధనవంతు పేదపిల్లని పెళ్లి చేసుకోవడమే చూపుతుంది. అందులోను నిరాక్ష్యరాసురాలిని ప్రేమించి పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకుంటాడు కథానాయకుడు రవి. ఈ కథ కులమతాలకు అతీతంగా ఉంటుంది. ఓ బ్రహ్మణ కుటుంబానికి చెందిన వారు, సుజాత వేరే కులం అమ్మాయి అయినప్పటికీ రవి ఇష్టపడి పెళ్లి చేసుకుని సుజతని ఇంటి పనిమనిషి స్థాయి నుంచి ముఖ్?యమంత్రి స్థాయికి ఎదుగుతుంది. ముందుగా టీవీ కార్యక్రమాల్లో పాల్గొంటుంది. తర్వాతా హీరోయిన్ గా మారుతుంది. ఓ సందర్భంలో డైరక్టర్ మిస్ బిహేవ్ చేయడంతో చెంప చెల్లు మనిపించి ఇక నుంచి తన సినిమాలు తానే తీయ్యాలనుకుంది. సినిమాల్లో హీరోగా తన భర్తనే ఎంచుకుంది. అలా ఆమె హీరోయిన్ గా మారి రాజకీయంలోకి అడుగుపెడుతుంది. నిజజీవితంలో కూడా ఇలానే జరుగుతున్నాయి. కదా దానిని అదారంగా తీసుకునే కథను రాశారు రచయిత. సాదారణ అమ్మాయి ముఖ్యమంత్రి ఓ బ్రహ్మణ కుటుంబ యువకుడు హీరోగా మారినా దాంపత్య జీవితానికి ఎక్కడ కొదవలేకుండా సాగుతోంది ఈ కథ. రచయిత రాసిన ఈ నాలుగు నవలికల్లో ఎక్కడా కూడా అసభ్యతా లేదు. అన్ని కథలు ప్రేమ పెళ్లిలు ఉన్నాయి. ఏ కథలో కూడా కథానాయకుడు కానీ, కథా నాయికానీ పెళ్లి ముందు తప్పుడు పనికి ఒప్పుకోరు. ప్రతీ కథలో అమ్మాయిని భారతీయ సంస్కృతిలో చూపించారు. కథానాయకున్ని మనస్సున్న మనిషిగా చూపించి.. తననే నమ్మి వచ్చిన భార్యకు అండగా నిలిచేలా కథలు రాశారు. నిజంగా నేటి కాలానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో అవసరం. నేడు ప్రేమ, రేపు శోభనం, ఎల్లుండి పెళ్లి అనే తంతు పాటిస్తున్నా నేటి యువతకి ప్రేమా పెళ్లీలను కొత్తగా చూపించారు. వారి కాలంలో ఇలాంటి ప్రేమలే కదా చూసింది. అందుకే కల్పషం లేని ప్రేమాను చూపించారు. ఆడపిల్లకు ఎదురయ్యే కష్టాలకు ఫ్యామిలీ మెంబర్స్ భర్త తోడుంటే ఎలా గెలుస్తుందో చూపించారు. ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.



కవిరత్న అమీనా కలందర్ జర్నలిస్ట్

## మట్టితో ఏడేళ్లుగా వినాయకుడి తయారీ

**- సొంతంగా ఇంట్లో ప్రతిష్టించి పూజలు**

**- వాసవి మహిళ అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మీ**

**తాండూరు** మన ప్రకృతి పంచభూతాల సమూహం.. అందులో భాగమైన భూమిలో మట్టికి మహారూపం అందించి పూజించడం ఎంతో పుణ్యమని తాండూరు వాసవీ మహిళ సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి శ్రీకాంత్ అంటున్నారు. వినాయక చవితి సందర్భంగా ఆమె వారి ఇంట్లో మట్టి వినాయకున్ని తయారు చేశారు. ప్రతి యేడాది వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకున్ని తయారు చేస్తున్నారు. ఏడేళ్లుగా ఇంట్లోనే మట్టి వినాయకున్ని తయారు చేసి.. ఆ విగ్రహాన్నే ప్రతిష్టించి పూజిస్తున్నారు. అయితే మట్టి వినాయకున్ని తయారు చేస్తున్న ఆమె నైపుణ్యం అందరిని అబ్బుర పరుస్తోంది. ఎంతో నియమ నిష్టలతో వినాయకున్ని తయారు చేయడం ఆకట్టుకుంది.ప్రతి ఏడాది విభిన్న రూపాలలో ఆమె వినాయకులను తయారు చేస్తున్నారు. ఈ యేడాది కూడా ఇంట్లోనే ఆమె మట్టి వినాయకునికి మహా రూపం అందించారు. మట్టి వినాయకున్ని తయారు చేసి అందంగా అందంగా అలంకరించారు. వినాయక చవితి వచ్చిందంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపై మక్కువ చూపిస్తుంటారు. ఇలాంటి సందర్భంలో కోట్రిక నాగలక్ష్మి చేస్తున్న మట్టి వినాయకుని తయారి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా కోట్రిక నాగలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని జరుగుతోందని అన్నారు. పంచభూతాల సమూహం అయిన ప్రకృతికి ఎవ్వరు చెడు చేయరాదనే ఉద్దేశంతో మట్టి వినాయకున్ని తయారు చేయడం జరుగుతుందని అన్నారు. అందరు మట్టి వినాకులను ప్రతిష్టించి పూజించాలని కోరారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం..
# పర్యావరణాన్ని కాపాడదాం

మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల అన్నారు. వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రామ్ మందిరం దగ్గర ఏర్పాటు చేసిన గణపతి మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి మంజుల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంజుల రమేష్ మాట్లాడుతూ.. పూర్వం మన పెద్దలు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలనే పూజించవరని గుర్తు చేశారు. కానీ ఈమధ్య కెమికల్స్ తో తయారు చేసిన రంగు విగ్రహాలను నిమజ్జనం చేయడం కారణంగా జల కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. కావున వికారాబాద్ పట్టణ ప్రజలు బాధ్యతగా ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలని పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాలే లక్ష్మణ్ గుప్తా, కార్యదర్శి యాష్కి సునీల్, వైస్ ప్రెసిడెంట్ రఘునందన్, కోశాధికారి దోమ శ్రీకాంత్, అదనపు కార్యదర్శి మ్యాడమ్ వేణుగోపాల్, మహిళా సంఘం అధ్యక్షురాలు మ్యాడమ్ లక్ష్మి, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, పెండ్యాల రవికుమార్, చింతలూరు శ్రీనివాస్, సతీష్, విక్రమ్, బాదం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ కుటుంబం నాకు
# దైవంతో సమానం: డీకే శివకుమార్

బెంగళూరు ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కర్ణాటక అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ కర్ణాటక అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీలో వివాదం చెలరేగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ అసెంబ్లీలో ఆర్ఎస్ఎస్ గీతం పాడటంపై పలువురు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. డీకే పార్టీ మారుతున్నారంటూ ఊహాగానాలు కూడా వినిపించాయి. ఈ వివాదంపై డీకే తాజాగా స్పందించారు. గాంధీ కుటుంబం తనకు దైవంతో సమానం అని చెప్పుకొచ్చారు.

## ఆధ్వానంగా మారిన 4 కోట్ల ఫంక్షన్ హాల్

**- ఎమ్మెల్యే మాధవరం**

**హైదరాబాద్** జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫంక్షన్ హాల్ పరిస్థితి అధ్వానంగా మారిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కేపి.హెచ్.బి కాలనీ లోని 4వ ఫేజ్ లో ఏర్పాటుచేసిన జిహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ను అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని విమర్శించారు.

నేడు స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసరావు తో కలిసి ఫంక్షన్ హాల్ ను సందర్శించి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తో పాటు అధికారులకు నెల రోజుల పాటు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వీటికి పునరుద్ధరణ పైన గడువును విధించారు లేదంటే జిహెచ్ఎంసి కార్యాలయాన్ని మూసేస్తామని అధికారులను హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్ లో ఉన్న భూములను అమ్ముకోవడం తప్ప అభివృద్ధి చేసేది ఏమీ లేదని ఉన్న వాటిని కూడా గాలికి వదిలేస్తున్నారని ఆక్షేపించారు.

## పటాన్ చెరులో
# ఉచిత గణపతి విగ్రహాల పంపిణీ

**సంగారెడ్డి** పటాన్ చెరు నియోజకవర్గం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ సమీపంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు వినాయక ప్రతిమలను పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ తప్పనిసరిగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా చెరువులను కాలుష్యం నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ కార్యాయలయాన్ని
# తరలించ వద్దు

**రంగారెడ్డి** ఇటిగ్రేటెట్ కార్యాలయాల పేరుతో ప్రజలకు అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలను తరలించవద్దని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి బిఆర్ఆర్ నాయకులతో కలిసి మంచిరెడ్డి కిషన్ రెడ్డి వినతిపత్రం అందజేసారు.

ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ కార్యాలయంను మంఖలకు తరలిస్తే ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, మాడుగుల మండల ప్రజలకు అసౌకర్యలకు గురవుతని, సబ్ రిజిస్ట్రేర్ కార్యాలను తరలింపు నిర్ణయాన్ని ఉపసమరించుకోవాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పెయిల్ అయిందని, ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటిల హమీలు ఎక్కడని ప్రశ్నించారు.

## మట్టి వినాయకుని పూజించాలని విద్యార్థుల ర్యాలీ

మంచిర్యాల, : మంగళవారం లక్షేటిపేటలో పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఉత్కూరు చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో పర్యావరణం కలుషితమవుతుందని ప్లకార్డులు ప్రదర్శించారు. మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు, మట్టి వినాయకుల ముద్దు అంటూ విద్యార్థులు నినదించారు.

## రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతి

బెల్లంపల్లి, : మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలపై మంగళవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు మృతి చెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. మృతుడికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని మంచిర్యాల రైల్వే పోలీసులు తెలిపారు.

## యువకుడికి అరుదైన
## నరాల శస్త్రచికిత్స విజయవంతం




చెన్నూరు, : కొమురం భీమ్ ఆసిఫాబాద్‌కు చెందిన పవన్ కుమార్ అనే యువకుడికి హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో సంక్లిష్టమైన సయాటిక్ నరాల శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. మంగళవారం మంచిర్యాలలో వైద్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, ప్లాస్టిక్, రీకన్స్ట్రక్టివ్ మైక్రో సర్జరీలో ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని అందిస్తున్నామని, ఈ అరుదైన శస్త్రచికిత్స ద్వారా యువకుడికి స్పర్శను తిరిగి అందించగలిగామని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య

ఆసిఫాబాద్, : హాజీపూర్ మండలం ముల్కల్ల వాగొడ్డు పల్లెకు చెందిన 51 ఏళ్ల వ్యవసాయ కూలీ కొట్టే బాపన్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై స్వరూప్ రాజ్ మంగళవారం తెలిపారు. ఇటీవల నడుము నొప్పికి ఆపరేషన్ చేయించుకున్న బాపన్న, వ్యవసాయ, కూలి పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఐదేళ్ల క్రితం కుమారుడు మరణించడం, తన ఆరోగ్యం సహకరించకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు.

## ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

సిర్పూర్, : ఆదిలాబాద్ నుంచి కప్పర్ల వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో, బండల్ నాగపూర్, పొచ్చెర గ్రామాల మధ్య ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోయింది. బస్సు ఒక వైపు వంగిపోవడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును కదలకుండా ఆపేశారు. ఇదే సమయంలో ఒక ఆటో కూడా బురదలో కూరుకుపోవడంతో పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ దుస్థితి కారణంగా అటువైపు వెళ్లేందుకు ఆర్టీసీ డ్రైవర్లు భయపడుతున్నారు.

## వేములవాడలో సైకిల్స్ పంపిణీ ప్రోగ్రామ్

వేములవాడ,: వేములవాడలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటించారు. జూనియర్ కళాశాల మైదానంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి పేద, మధ్యతరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి డా. వికాస్ రావు కూడా పాల్గొన్నారు.

## మంత్రి ఇలాఖాలో
## యూరియా కోసం రైతుల ధర్నా



ధర్మపురి, : గొల్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం రైతులు యూరియా కోసం ధర్నా చేపట్టారు. పంటలకు అత్యవసరమైన ఎరువులు సమయానికి అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## వార్డెన్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి..!

భద్రాచలం, : దుమ్ముగూడెం గిరిజన బాలుర వసతి గృహాన్ని పీడిఎస్యు జిల్లా బృందం మంగళవారం సందర్శించింది. హాస్టల్ వార్డెన్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ మండిపడ్డారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు మరుగుదొడ్లు లేకపోవడం, కిటికీలకు డోర్లు లేకపోవడం వల్ల దోమల బెడద తీవ్రంగా ఉందని, వార్డెన్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి

కొత్తగూడెం, : మంగళవారం, చర్ల మండలం కుర్నపల్లి గ్రామానికి చెందిన రైతు సోయం వీరాస్వామి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్తుండగా, తెగిపడిన త్రీఫేస్ కరెంటు తీగను గమనించకుండా తొక్కడంతో విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పీఏసీఎస్ వద్ద వేలిముద్ర పడక రైతులు నిరాశ

ఇల్లందు,: ఇల్లందు పీఏసీఎస్ యూరియా గోదాంలో ఆన్లైన్ సేవలు నిలిచిపోయాయి. వేలిముద్రలు పడకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరతతో పాటు సాంకేతిక సమస్యలు తోడవడంతో అన్నదాతలు రోజుల తరబడి నిరీక్షిస్తూ నిరాశ చెందుతున్నారు. కొందరు రైతులు నిస్సహాయంగా వెనుదిరిగారు.

# సామాజిక భాధ్యతను గుర్తుచేసే వినాయక చవితి

## వినాయక చవితి ప్రత్యేకం

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం,
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే

ప్రతి పండగ వెనకా ఓ మహోన్నత లక్ష్యం కనిపిస్తుంది. ప్రకృతిలో మమేకమవుతూ నేలా–నీరు, చెట్టూ – పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం అనాధిగా మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వస్తోంది. నిజానికి ఇదే మన భారతీయ సంస్కృతి గొప్పదనం.

దేశమంతా వినాయక చవిత ఉత్సవాలకు సిద్ధమవుతోంది. పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిది.

### వినాయక చవితి ప్రాముఖ్యత

బాల్యంలో, వినాయకుడికి తన తల్లి స్నానానికి కాపలాగా ఉండే బాధ్యతను అప్పగించి ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. శివుడు స్వయంగా లోపలికి ప్రవేశించడానికి ప్రయత్నించినప్పుడు వినాయకుడు విధిగా అడ్డుకోగా నిరాశ చెందిన క్షణంలో, శివుడు త్రిరశూలంతో వినాయకుడి తలను నరికివేశాడు. ఈ సంఘటన పార్వతి దేవిని తీవ్రంగా కదిలించింది, ఆమె వినాయకుడిని తిరిగి బ్రతికించాలని పరమేశ్వరున్ని వేడుకుంటుంది. అప్పుడు వినాయకుడిని పునర్జీవింపచేయడానికి బ్రహ్మ దేవుడు తూర్పు వైపుకు తల ఉంచి పడుకున్న ఏనుగు తలను అతని శరీరానికి అతికించాడు, ఫలితంగా అతను ఏనుగు తల గల దేవతగా విలక్షణంగా పునర్జీవించాడు. ఈ విలక్షణమైన రూపం వినాయకుడి లక్షణంగా మారింది. అతని ప్రత్యేక రూపానికి మించి, ప్రజల అడ్డంకులను తొలగించి, విజయాలు, శ్రేయస్సును ప్రసాదించే దేవదేవునిగా ప్రసిద్ధి చెందాడు.

### వినాయక చవితి పూజను ఎలా జరుపుకుంటారు

వినాయక చవితి పండుగను పది రోజుల పాటు జరుపుకుంటారు. ఇది ఒక ప్రజా ఉత్సవం. తీపి వంటల నైవేద్యం పెడతారు. పండుగ రోజున, ప్రజలు వినాయకుని దర్శించుకోవడం కోసం ఇళ్లలో, బహిరంగ ప్రదేశాలలో అలంకరించబడిన మండపాలు, పాఠశాలలు, కళాశాలలు వినాయక విగ్రహాలను ప్రతిష్టిస్తాయి

### గణేష్ చవితి చరిత్ర

1892 లో ప్రజా వ్యతిరేక అసెంబ్లీ చట్టం ద్వారా హిందూ సమావేశాలపై బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాన్ని విధించింది. భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య తిలక్, బ్రిటీష్ వారిపై భారత స్వాతంత్ర్యోద్యమానికి మద్దతుగా ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తి రగిలించే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టలేదు. దేశవ్యాప్తంగా అందరినీ ఒక్కటి చేసే సంకల్పంతో ఇప్పుడు నిరంతరంగా సాగుతున్న గణపతి ఉత్సవాలను శివాజీ మహరాజ్ మొదటిసారిగా ప్రారంభించాడు. భారతీయుల పూజా మందిరాల్లో జరిగే గణేశ పూజకు సామూహికమైన, సామాజికమైన, సార్వజనీనమైన ప్రాధాన్యత అందించడంలో అతను చేసిన కృషి అనన్య సామాన్యం.అప్పటి నుండి సామూహికంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవడం ఒక సంప్రదాయంగా మారింది. భారతదేశంలో విస్తృతంగా జరుపుకునే వినాయక చవితి వేడుక కోసం వివిధ వర్గాలు, నేపథ్యాల ప్రజలు కలిసి వస్తారు. వివిధ కులాలు, మతాలు, సామాజిక తరగతుల వ్యక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు కాబట్టి, ఇది సంఘీభావ భావాన్ని పెంపొందిస్తుంది. ఇది చాలా కాలంగా జరుపుకుంటున్నందున, ఈ పండుగ చారిత్రాత్మకంగా, సాంస్కృతికంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది భారతీయ వారసత్వం సంస్కృతిలో విశిష్ట స్థానం పొందింది.

### గణేష్ చతుర్థి కథ ఏమిటి

వినాయక చవితి పండగను వినాయకుని పుట్టిన రోజు అని కూడా భక్తులు విశ్వసిస్తారు. హిందువులకు అత్యంత పర్వదినమైన ఈపండగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

### వినాయక విగ్రహాలను నీటిలో ఎందుకు నిమజ్జనం చేస్తారు

వినాయక నిమ్మజ్జనం పండుగ ముగింపును సూచిస్తుంది, అలాగే భూమిపై ఉన్న ప్రతిదీ చివరికి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్రకృతి అంశాలతో విలీనం అవుతుందనే వాస్తవాన్ని సూచిస్తుంది. ఇది వినాయకుడి జన్మ చక్రాన్ని కూడా సూచిస్తుంది – ఆయన మట్టి నుండి జన్మించి ఆ రూపంలోనే తిరిగి వస్తాడు. వినాయకుడు తన భక్తులతో 3 నుండి 10 రోజులు గడిపిన తర్వాత తన స్వర్గపు నివాసానికి తిరిగి వెళ్తాడని భక్తుల విశ్వాసం.

### వినాయక నవరాత్రుల రోజువారి ప్రత్యేకతలు

వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించబడిన మండపాలలో మట్టితో తయారు చేసిన వినాయకుని దివ్య మంగళ విగ్రహన్ని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో ఆవహణం చేసుకొని ప్రత్యేక పూజలతో వినాయక చవితి వేడుకలను ప్రారంభించి 7 నుండి 10 రోజుల పాటు అత్యంత ఘణంగా సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

### వినాయక పూజకు వాడే 21 రకాల పత్రాలు వాటి ప్రత్యేకత

హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఒకటి వినాయక చవితి రోజున వినాయకుడిని పూజించేందుకు పత్రిని ఉపయోగిస్తారు. 21 రకాల ఆకులతో పుజిస్తారు. వినాయకుని పూజలో ఉపయోగించే పత్రిలో అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ నియమం వెనుక మన పూర్వీకులకు ఉన్న ముందు చూపు అని అంటారు. ఎందుకంటే వర్షాకాలంలో అనేక రకాల వ్యాధులు వస్తాయి. వ్యాధి నివారణకు వన మూలికలను గుర్తు చేయడమే ఈ పత్రితో పూజ నియమం అని అంటారు. ఈ రోజు 21 రకాల పత్రి ఆరోగ్య ప్రయోజనాలు పరిశీలిస్తే

**మాచిపత్రి:**

మంచి సువాసన ఉంటుంది. దీనికి వేడి చేసే స్వభావం ఉంది. మాచిపత్ర నూనెని ఉపయోగిస్తే ఆహారం జీర్ణం అవుతుంది. ఆకలి కలుగుతుంది. మనోవైకల్యము, అలసట నివారించును.

**ములక**

(బృహతీ పత్రం): దగ్గు , ఆయాసాన్ని తగ్గిస్తుంది. ఆకలిని కలిగిస్తుంది. మూత్ర విసర్జన అవుతుంది. కండరాలకు పుష్టిని. వీర్యవృద్ధిని ఇస్తుంది. ములక వేసి ఆముదం వేడి చేసిన తాగితే వాతం తగ్గుతుంది. నేల ములక వేరు రసం , తేనె కలిపి తీసుకున్నా దగ్గు తగ్గుతుంది.

**మారేడు:**

ఈ చెట్టు అన్ని భాగాలు ఔషధ గుణాలు ఉన్నవే. మారేడు కాయల్లోని గుజ్జు అతిసార రోగాన్ని తగ్గిస్తుంది. విషాన్ని హరిస్తుంది. దీని ఆకుల రసం మధుమేహవ్యాధి నివారణలో ఉపయోగపడుతుంది.

**గరిక:**

ఇది కలుపు మొక్క. అయితే మంచి క్రిమిసంహారిణి. అంటు వ్యాధుల నుంచి కాపాడుతుంది. చర్మరోగాలు నివారణలో ఉపయోగపడుతుంది. గరిక రసం వాంతులు, విరేచనములు తగ్గిస్తుంది. గాయాలకు దీని రసము ఉపయోగిస్తారు. దీని వేర్ల కషాయం గనేరియా వ్యాధిలో పై పూతకు ఉపయోగిస్తారు

**నల్ల ఉమ్మెత్త:**

తేలు మొదలగు విషజంతువుల విషానికి విరుగుడుగా పనిచేస్తుంది. ఉమ్మెత్త ఆకులను ఉబ్బసం, కోరింతదగ్గు మొదలైన వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తారు. కీళ్లనొప్పుల నివారణకు దీని ఆకుతో కాపడం పెడతారు. అయితే ఇది విషప్రభావం కలిగిన మొక్క. కనుక దీనిని శుద్ధి చేయకుండా అనుభవం లేనివారు ఉపయోగించరాదు.



**రేగు:**

గొప్ప ఔషధ గుణములు కలిగి ఉన్నాయి. మొలల సమస్య ఉన్నవారు రేగుచెక్క కషాయంలో కూర్చో బెట్టడం వలన ఫలితం ఉంటుంది. మూత్రశాయంలో రాళ్లు కరుగడానికి రేగు వేరు కషాయంలో రేగు బెరడు చూర్ణం కలిపి తాగడం వలన ఫలితం ఉంటుంది. రేగు వేరు పైన బెరడు మేకపాలతో కలిపి నూరి పూసిన మంగు మచ్చలు తగ్గుతుంది.

**ఉత్తరేణి:**

దీని వేర్లు దంతాలకు ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఉత్తరేణి ఆకుల రసం , దిరిసెన ఆకురసం కలిపి తాగించిన క్రిములు నశిస్తాయి. తేనెటీగలు కుట్టినచోట దీని ఆకురసం అప్లై చేయడం వలన ఫలితం ఉంటుంది.

**తులసి దళం:**

అనేక ఔషధగుణాలున్నాయి. తేలు కుట్టినచోట తులసివేరుని పైనుంచి క్రిందికి పలుమార్లు తిప్పితే విషం దిగుతుందట. జలుబు, దగ్గు ఉపశమనానికి మంచి మెడిసిన్. వాతవ్యాధుల వలన దెబ్బతిన్న అవయవాలకు తులసి రసం అప్లై చేస్తే మంచి ఫలితం ఉంటుంది. తులసి ఆకురసం తలకు పట్టించి కొంచంసేపటి తరువాత తలస్నానం చేసిన పేలు సమస్య తగ్గుతుంది.

**మామిడి ఆకులు:**

మామిడి చిగుళ్ల రసం తేనెతో కలిపి తీసుకుంటే పైత్యం హరిస్తుంది. మామిడి చెట్టు నుంచి కారు జిగురు కాలిపగుళ్ళకు అప్లై చేస్తే కాలిపగుళ్లు తగ్గుతాయి. మామిడి ఆకుల కషాయంలో తేనె కలిపి సేవించిన గొంతు పూడుకుపోయే సమస్య తగ్గుతుంది.

**గన్నేరు:**

దీని బెరడు గుండెజబ్బులకు , మూత్రవ్యాధు నివారణకు ఉపయోగిస్తారు . దీని వేరు అరగదీసిన గంధము చర్మవ్యాదులలో , కుష్టు మొదలగు వాటికి నివారణకు మంచి మెడిసిన్.

**విష్ణు కాంత:**

ఇది జ్వరం, కఫం, దగ్గు, తగ్గించడానికి, విరోచనాల నివారణకు, ఉబ్బస వ్యాధులను దూరం చేసేందుకు ఉపయోగపడుతుంది.

**దానిమ్మ:**

విరేచనాలలో రక్తం పడుతున్నా, నోరు రుచి తెలియని సమస్య ఉన్నా, నోటి నుంచి రక్తం పడుచున్నా, అతిసారం, దగ్గు, కామెర్లు, మొలలు, ముక్కు నుండి రక్తం కారడం, కండ్ల కలకలు, గొంతు నొప్పి, చర్మ వ్యాధులు నివారణకు దానిమ్మని ఉపయోగిస్తారు.

**దేవదారు:**

దీని ఆకు క్రిమి సంహారముగా పనిచేస్తుంది. దీని బెరడు జ్వరాన్ని, విరేచనాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**మరువం:**

ఇది సుగంధద్రవ్యపు మొక్క. కీళ్లనొప్పి, వాతం, కఫం వంటి వాటిని హరించును . తేలు, జెర్రి వంటి విష పురుగుల విషాన్ని హరిస్తుంది. విష జ్వరం హరిస్తుంది. హృద్రోగము , శ్వాస , శోషరోగాన్ని హరిస్తుంది. గజ్జి, చర్మరోగాలు నయం అవుతాయి.

**వావిలి:**

ఒళ్ళు నొప్పులు, చెవిలో చీము, పొట్లపాము , కట్లపురుగు కరిచిన వావిలి వేరు నీటితో నూరి తాగించిన విషము హరించును . జ్వరం, తలనొప్పి, కీళ్ళ నొప్పులు, గాయాలు, చెవిపోటు, మూర్ఛ వ్యాధి, ప్రసవం తరువాత వచ్చే ఇబ్బందులను తగ్గిస్తుంది.

**జాజి పత్రం:**

చెవిలో నుంచి చీము కారుతున్నా, స్త్రీలలో ఋతుక్రమం సరిగ్గా లేకున్నా వాత నొప్పులు, జీర్ణాశయ వ్యాధులు, మలాశయం వ్యాధులు, నోటి పూత, దుర్వాసన, కామెర్లు, చర్మ వ్యాధులు నుంచి ఉపశమనం కోసం జాజి పత్రం ఉపయోగిస్తారు.

**దేవ కాంచనం:**

ఆకు ముద్దగా నూరి కుష్ఠరోగపు మచ్చలపై వేసి కట్టిన మచ్చలు నయం అగును. మూర్ఛ వ్యాధి, కఫం, పొట్ట సంబంధ వ్యాధులు. నులి పురుగుల నివారణకు ఉపయోగపడుతుంది. ఎలుక విషమునకు దీని ఆకురసం మంచి మెడిసిన్.

**జమ్మి:**

దీనిని భస్మప్రక్రియలలో వాడతారు. కఫం, మూల వ్యాధి, కుష్టు వ్యాధి, అతిసారం, దంత వ్యాధులు నివారించడానికి ఉపయోగపడుతుంది.

**రావి:**

స్త్రీ , పురుషుల్లో సంతానోత్పత్తికి అద్భుతముగా పనిచేయును. మల బద్ధకం, వాంతులు, మూత్ర వ్యాధులు, జ్వరాలు నివారించడానికి ఉపయోగపడుతుంది. జీర్ణ శక్తి, జ్ఞాపక శక్తి పెంపొందించడానికి సహకరిస్తుంది. చర్మవ్యాధులకు, సుఖవ్యాధుల నివారణకు, దీని పాలు పాదాల పగుళ్ళకు , చర్మపు పగుళ్లకు పనిచేయును.

**తెల్ల మద్ది:**

దీని బెరడు గుండె జబ్బులలో పనిచేస్తుంది. చర్మ వ్యాధులు, కీళ్ళ నొప్పులు, మలాశయ దోషాలు, గుండె జబ్బుల నివారణకు ఉపయోగపడుతుంది. వ్రణములపైన దీని ఆకులు వేసి కట్టు కట్టిన త్వరగా తగ్గుతుంది. క్షయ దగ్గు నివారణకు కూడా ఉపయోగిస్తారు.

**జిల్లేడు:**

వాతమును హరిస్తుంది. క్రిమిరోగములను , దుష్టవ్రణములను , శ్వాస , కాసలను హరిస్తుంది. చర్మ వ్యాధులు, సెగ గడ్డలు, కీళ్ళ నొప్పులు, చెవిపోటు, కోరింత దగ్గు, దంతశూల, విరేచనాలు, తిమ్మిర్లు, బోధకాలు , వ్రణాలు తగ్గించడానికి ఉపయోగపడుతుంది. తేలు కుట్టిన ప్రదేశములో జిల్లేడు ఆకు మెత్తగా నూరి కట్టి గుగ్గిలం పొగవేస్తే విషం హరిస్తుంది.




వినాయక చవితి శుభాకాక్షలతో
సంతోజు. రవి కుమార్
బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)

# సత్సంకల్పాలు - ఐక్యత వినాయక చవితి సారాంశం

**- మట్టి గణపతులనే పూజించండి**

**- పర్యావరణాన్ని కాపాడండి**

**- చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు**

**- ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న**

గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సామాజిక వేత్త,టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న పర్యావరణ పరిరక్షణ దిశగా సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి పండుగ సత్సంకల్పాలకు, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.

"ప్రతీ ఒక్కరూ గణనాథుడి ఆశీస్సులు పొంది సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. ఈ పండుగను పర్యావరణహితంగా జరపడం చాలా ముఖ్యం. మన నీటి వనరులు,చెరువులు,కుంటలు కలుషితం కాకుండా మట్టి గణపతులనే వినియోగించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం వల్ల పర్యావరణానికి భారీ నష్టం జరుగుతుంది. ప్రకృతి స్నేహపూర్వక పద్ధతుల్లోనే వేడుకలు నిర్వహించాలి" అని లచ్చన్న తెలిపారు.అలాగే ఆయన ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ %-% "పండుగలు కేవలం ఆచారాలు మాత్రమే కాదు,సమాజానికి శుభసందేశాలు అందించే వేదికలు. వినాయకుడి ఆరాధనలో భాగంగా శుభసంకల్పాలు మన జీవితంలో అమలు చేయాలి"అని,"మట్టి గణపతులనే పూజించండి - పర్యావరణాన్ని కాపాడండి" అని పిలుపునిచ్చారు.తూడి లచ్చన్న చొప్పదండి నియోజకవర్గ



ప్రజలకు మరోసారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఐక్యత, భక్తి, పర్యావరణ పరిరక్షణతో ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## విజ్ఞానగిరి పై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ విజ్ఞానగిరి పై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి మంగళవారం సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో పలు రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. తదుపరి పలురకాల పుష్పాలతో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారిని చందనాలంకారం అనంతరం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు.

## విద్యా రంగానికి నిధులు కేటాయించండి

**ఏబీవీపీ డిమాండ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) విద్యా రంగానికి నిధులు కేటాయించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్పల్లి విభాగ్, మేడ్చల్ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ లోని స్వామి వివేకనంద విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకోసం నిధులు కేటాయించకపోవడం శోచనీయమని, విద్యాశాఖ కు మంత్రి లేకపోవడం దురదృష్టకరమని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక మాట మాట్లాడి ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తుందని ఆరోపించారు. ఇలా మాయమాటలు చెప్పే ఈ ప్రభుత్వానికి రాష్ట్రని పరిపాలించే నైతిక హక్కు కోల్పోయిందన్నారు. ఇదే కాకుండా మేడ్చల్ లో గత 15 సంవత్సరాలు గా డిగ్రీ కళాశాల కావాలని కోరిన స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆయన విద్యాసంస్థల వ్యాపారంలో పడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విషయాన్ని మర్చిపోయారని దుయ్యబట్టారు. మేడ్చల్ లో డిగ్రీ కళాశాల ను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శులు హర్షిత్, పార్థసారధి, నగర సంయుక్త కార్యదర్శులు గౌతమ్, మనోజ్, తదితరులు ,పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారంలోని శ్రీ మహాకాళి సహిత మహా కాలేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఎస్ఎస్ఎస్ యువసేన, యూత్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మట్టి గణపతులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మట్టి గణపతి పంపిణీ చేస్తున్నట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కు పాటుపడాలని, వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా వేడుకలు జరుపుకోవాలని ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి సూచించారు. యువసేన సభ్యులు రామకాంత్ లోకే, కిషోర్ రెడ్డి, విజయ్ కుమార్ సింగ్, మొహమ్మద్ జావీద్, సాయి ప్రసాద్, మహేష్ రెడ్డి అలేటి శ్రీకాంత్, అక్షంత్, జ్యోషిత్ యాదవ్, సందీప్ జోని, సందీప్ కుమార్, రాహుల్, నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## టి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన బిజెపి నాయకులు



కరీంనగర్(ప్రశ్న న్యూస్) టి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శంకర పట్నం బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలో మహేష్ గౌడ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని అపహస్యం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఇష్టరాజ్యంగా మాట్లాడుతున్నారని ప్రజాస్వామ్య యుతంగా రెండుసార్లు కరీంనగర్ పార్లమెంటు సభ్యులుగా ఎన్నికై కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బండి సంజయ్ ని వార్డు మెంబరుగా కూడా గెలవని మహేష్ గౌడ్ విమర్శించడం సిగ్గు చేటని, ఆయన మాటలతో కరీంనగర్ ఓటర్లను అవమానపరిచినట్టుగానే భావిస్తున్నామని, మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ ఓటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి నాయకులు దొంగల రాములు, జంగ జైపాల్, దాసరపు నరేందర్, కొయ్యడ అశోక్, కొయ్యడ కుమార్, కనకం సాగర్, మందడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, పడాల వెంకటలక్ష్మి, పెసరి వీరార్జున్, రాజిరెడ్డి, చెర్ల శ్రీనివాస్, దాసరి సంపత్, గౌరవేని శ్రీనివాస్, జానపట్ల రాజిరెడ్డి, ప్రశాంత్, రవి, అనీల్, సతీష్, నర్సయ్య లతపాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయక పోతే నీ భరతం పడతాం - మంద కృష్ణ మాదిగ

**- రేవంత్ రెడ్డి సర్కార్ ఏ కులమైనా ఏ మతమైనా పేదలందరికీ పెన్షన్ పెంచాల్సిందే**

**- పెన్షన్ పెంచకపోయిన కొత్త పెన్షన్ మంజూరు చేయకపోయినా తాడోపేడో తెలుసుకోవడానికి నేను రెడీ**

**రేవంత్ రెడ్డి కి సవాల్ విసిరిన మందకృష్ణ మాదిగ**




నగర్ కర్నూల్(ప్రశ్న న్యూస్) నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో పార్థసారధి ఫంక్షన్ హాల్లో వికలాంగులు పెన్షన్ దారుల మహా గర్జన సభ విజయవంతం చేయుటకై ఏర్పాటు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు అయినప్పటికీ 4,000 నాలుగు వేల పెన్షన్ ఇవ్వలేదని మరో పది లక్షల మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని అవి మంజూరు చేయాలని కోరారు, అంతేకాకుండా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కష్టపడేది కేవలం మాదిగల కోసమే కాదు, అందరి కోసం ఏ కులమైనా ఏ మతమైన పేదలందరికీ పెన్షన్ పెంచాల్సిందే పెన్షన్ పెంచకపోయిన కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోయినా రేవంత్ రెడ్డి సర్కార్ తో తాడోపేడో తేల్చు కోవడానికి సెప్టెంబర్ 9న హైదరాబాదులో బహిరంగ చర్చకు నేను రెడీ నువ్వు రెడీ ఆ అంటూ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎస్ఎఫ్, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యల పరిష్కారమే నా కర్తవ్యం

**- ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే ఆది సహకారంతో రైతులకు అండగా ఉంటా**

**- రుద్రవరం సింగిల్విండో చైర్మన్ : రేగులపాటి కృష్ణదేవరావు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో,వేములవాడ అర్బన్ మండలం,రుద్రవరం సింగిల్విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంగళవారం సింగిల్విండో పరిధిలోని రైతులకు అవసరమైన యూరియాను లారీలో తెప్పించి పంపిణీ చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృష్ణదేవరావు సేవలను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణదేవ రావు మాట్లాడుతూ "రైతాంగం కష్టాల్లో పడకుండా చూడడం నా మొదటి కర్తవ్యం. యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిన వెంటనే అవసరమైన ఎరువును సమకూర్చేందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో కృషి చేశాం. భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమయానికి అందించేందుకు కృషి చేస్తాం. ఎప్పుడైనా సమస్యలుంటే నేరుగా నన్ను సంప్రదించండి," అని రైతాంగాన్ని కోరారు.

## కమిషనర్ కలిసిన దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన భవాని ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తలపా దామోదరం రెడ్డి శ్రీకాళహస్తి మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించినటువంటి భవాని ప్రసాద్ ని దుశాలువా తో సత్కరించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, మండల యువ జన అధ్యక్షులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



వాజేడు (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు చెరుకూరు మురుమూరు గ్రామాలకు చెందిన వ్యక్తులు అనారోగ్య పాలై ఆసుపత్రిలో అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయిన రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిధులు మంజూరు చేయడం జరిగింది సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన లబ్ధిదారులకు వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ అనారోగ్య పాలయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా నష్టపోయిన వ్యక్తులకు ప్రతినెల ప్రతి మండలానికి ఐదు లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతుందని దీనిలో భాగంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సర్వతో లబ్ధిదారులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా అనారోగ్య పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా నష్టపోయిన వ్యక్తులు సీఎం రిలీఫ్ ఫండ్ కు అప్లై చేసుకోవాలని ఆయన కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు మైనార్టీ నాయకులు ఎస్.కె ఖాజావలి చెన్నం శ్రీను పసుల లక్ష్మణ్, చెన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఏడుచర్లపల్లి పంచాయతీ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులకు చందాలు



వాజేడు (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా వాజేడు మండలం ఏడుచర్లపల్లి గ్రామపంచాయతీ లోని వినాయక నవరాత్రులకు( మండపాలకు ).. వాజేడు కాంగ్రెస్ మండల పార్టీ సూచనల మేరకు ఏడుచర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులకు. చందాలు ఇవ్వడం జరిగింది ఏడుచర్లపల్లి కొత్తూరు:10000/ రూపాయలు (SC) బోర్ గూడెం. 5000/ రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏడుచర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## రాజన్నాలయానికి భారీ అభివృద్ధి - త్వరలో టెండర్లు పూర్తి

**- వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం**

**- రూ.76 కోట్లతో విస్తరణ - పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రణాళికల వివరణ**

**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే :-ఆది శ్రీనివాస్**



వేములవాడ (ప్రశ్న న్యూస్)దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఓపెన్ స్లాబ్‌లో మంగళవారం నిర్వహించారు. భక్తులు,పట్టణ ప్రముఖులకు అభివృద్ధి ప్రణాళికలు వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఈఓ రాధాబాయి, స్తపతి వల్లి నాయగం, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో గత సంవత్సరం నవంబర్ 20న ఆలయ అభివృద్ధి శంకుస్థాపన జరిగిందని గుర్తుచేశారు. 76 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవనున్నాయని,ప్రధాన పనులలో నిత్య అన్నదాన సత్రం, అభిషేక మండపం, కళ్యాణ మండపం, సత్యనారాయణ వ్రత మండపం నిర్మాణం, పలు ఆధునిక సదుపాయాల ఏర్పాటు ఉన్నాయన్నారు.అభివృద్ధి ప్రణాళికలో ఎటువంటి అపోహలు లేకుండా నమూనా డిజైన్లను ప్రజలకు వివరించారు. శృంగేరి పీఠాధిపతుల సూచనలతో పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. భక్తుల సూచనలు స్వీకరించి ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ఆది హామీ ఇచ్చారు.

# వినాయక పుట్టుక చరిత్ర

## వినాయక వ్రత కథ





సూత మహాముని శౌనకుడు మొదలైన మునులకు విఘ్నేశ్వరుడు పుట్టిన విధానం, ఆరోజు చంద్రుడిని ఎందుకు చూడకూడదు అనే విషయాలను వివరించటం మొదలు పెట్టాడు.

ఒకప్పుడు గజ (ఏనుగు) రూపంలో వున్న గజాసురుడు అనే రాక్షస రాజు పరమ శివుడిని గురించి తీవ్ర తపస్సు చేయటం ప్రారంభించాడు. అతని తపస్సుకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై ఏదన్నా వరం కోరుకోమన్నాడు. అప్పుడు గజాసురుడు "స్వామీ, మీరు ఎప్పుడూ నా ఉదరం లోపలే వుండాలి" అని కోరుకున్నాడు.

మహేశ్వరుడు అతని కోర్కె తీర్చేందుకోసం గజాసురుడి పొట్ట లోపలికి ప్రవేశించి అక్కడే వుండటం మొదలు పెట్టాడు.

ఇదిలా వుంటే, కైలాసం (శివుడి ఇల్లు)లో వున్న పార్వతీదేవి భర్త గురించి తెలియక అన్ని చోట్లా వెతుకుతూ కొంతకాలానికి శివుడు గజాసురుడి పొట్టలో వున్నాడని తెలుసుకుంది. కానీ, శివుడిని ఏ విధంగా బయటకు రప్పించాలో తెలియక ఎంతో

గా బయటకు రప్పించాలో తెలియక ఎంతో బాధపడి, చివరికి విష్ణుమూర్తిని ప్రార్థించి, తన భర్త విషయం చెప్పింది.

"ఓ మహానుభావా, పూర్వం భస్మాసురుని బారినుంచి నా భర్తని కాపాడి నాకు ఇచ్చావు. ఇప్పుడు కూడా ఏదన్నా ఉపాయం ఆలోచించు" అని కన్నీళ్ళు కార్చింది. విష్ణుమూర్తి పార్వతీ దేవిని ఓదార్చి పంపేశాడు.

అప్పుడు శ్రీహరి బ్రహ్మ మొదలైన దేవతలను పిలిచి గజాసురుని చం పేందుకు గంగి రెద్దులను ఆడించేవాడిగా వెళ్ళటమే సరైనది అని నిర్ణయించాడు.

శివుడి వాహనం నందిని ఒక గంగి రెద్దుగా చేసి, బ్రహ్మ మొదలైన దేవతల చేత తల కొక వాయిద్యం ఇచ్చాడు. తాను చిరు గంటలు, సన్నాయి తీసుకుని గజాసురుడు వుండే గజాసురపురం దగ్గరకు

వెళ్ళాడు. అక్కడ గజాసురుడి ఎదురుగా చక్కగా నందిని ఆడించాడు. ఆ గంగి రెద్దు ఆట చూచి గజాసురుడు ఆనందం పొంది, "మీకు ఏం కావాలో కోరుకోండి. నేను ఇస్తాను" అని చెప్పాడు. అప్పుడు శ్రీహరి "ఇది శివుడి వాహనం నంది. శివుడిని వెదికేందుకే వచ్చింది కాబట్టి శివుడిని ఇవ్వు" అని కోరాడు.

ఆ మాటలకు నిర్ఘాంతపడిన గజాసురుడు గంగి రెద్దులను ఆడించేందుకు వచ్చిన వాడు శ్రీహరి అని తెలుసుకుని, తనకు చావు తప్పదని అర్థం చేసుకున్నాడు. అపుడు తన పొట్టలోపల వున్న శివుడిని "నా శిరస్సు అందరికీ పూజ్యనీయంగా వుండాలి. నా చర్మం నువ్వు ధరించాలి" అని కోరుకున్నాడు. తర్వాత తనను చంపేందుకు శ్రీహరికి

కున్నాడు. తర్వాత తనను చంపేందుకు శ్రీహర%ూ% అనుమతి ఇచ్చాడు. నంది తన కొమ్ములతో గజాసురుడిని పొట్ట చీల్చగా, లోపలనుంచి శివుడు బైటకు వచ్చాడు.

హరి శివుడితో "చెడ్డవారికి ఇలాంటి వరాలు ఇవ్వకూడదు. ఇస్తే పాముకు పాలు పోసినట్టే అవుతుంది" అని చెప్పాడు. తర్వాత బ్రహ్మ, ఇతర దేవతలకు వీడ్కోలు పలికి తాను కూడా వైకుంఠానికి వెళ్ళిపోయాడు. శివుడు కైలాసానికి వెళ్ళిపోయాడు.

### "వినాయకుడి పుట్టుక"

కైలాసంలో వున్న పార్వతీదేవి శివుడు వస్తున్నాడన్న వార్త విని తల స్నానం చేయాలని నిర్ణయించుకుని నలుగు పిండితో ఒక పిల్లవాడిని తయారు చేసింది. అతనికి ప్రాణం పోసి గుమ్మం ముందు వుంచింది.

స్నానం చేసిన తర్వాత నగలతో అలంకరించుకుని శివుడి కోసం ఎదురు చూడటం మొదలు పెట్టింది.

ఇది ఇలా వుండగా, శివుడికి లోపలికి వస్తుండగా గుమ్మంలో వున్న పిల్లవాడు అడ్డు చెప్పాడు. కోపం తెచ్చుకున్న శివుడు త్రిశూలంతో ఆ బాలుడి కంఠం నరికాడు.

లోపలికి వెళ్ళిన శివుడికి పార్వతీదేవి ఎదురువచ్చి పూజించి, కూర్చోబెట్టి మాట్లాడుతుండగా గుమ్మంలో వున్న పిల్లవాడి ప్రసక్తి వచ్చింది. అప్పుడు శివుడు తాను చేసిన పనికి బాధపడి, తాను తీసుకు వచ్చిన గజాసురుడి శిరస్సును ఆ బాలుడికి అతికించి ప్రాణం పోశాడు. అతనికి 'గజాననుడు' అనే పేరు పెట్టి, పెంచుకోవటం ప్రారంభించారు.

గజాననుడు కూడా భక్తితో తల్లి తండ్రులకు సేవలు చేయసాగాడు. అనింద్యుడు అనే ఎలుకను

వాహనంగా చేసుకుని తిరగటం మొదలు పెట్టాడు. కొంతకాలానికి పార్వతీ పరమేశ్వరులకు కుమారస్వామి పుట్టాడు. అతడు మహా వీరుడు. నెమలి అతని వాహనము.

### "విఘ్నేశాధిపత్యము"

ఒకరోజు దేవతలు, మునులు, మానవులు పరమేశ్వరుని సేవించి, "విఘ్నములకు ఒక అధిపతిని ఇవ్వండి" అని కోరారు. తాను పెద్దవాడు కాబట్టి ఆ నాయకత్వ పదవి తనకే వుండాలని గజాననుడు కోరాడు. గజాననుడు పొట్టిగా వుంటాడు, తగిన అర్హతలు లేవు కాబట్టి అధిపత్యం తనకే ఇవ్వాలని కుమారస్వామి తండ్రిని కోరాడు. శివుడు వారితో "మీలో ఎవరు మూడు లోకాల్లోని

పుణ్య నదుల్లో స్నానం చేసి ముందుగా నా దగ్గరికి వస్తారో వారికి ఆ ఆధిపత్యం ఇస్తాను" అని చెప్పాడు.

కుమారస్వామి తన నెమలి వాహనం మీద ఎక్కి వేగంగా ముల్లోకాలూ తిరగటానికి వెళ్లిపోయాడు. గజాననుడు బాధపడుతూ తండ్రి దగ్గరికి వెళ్ళి నమస్కరించి "అయ్యా, నా గురించి తెలిసి కూడా ఈ విధంగా చెప్పటం మీకు సరైనదా? మీ పాద సేవకుడిని. నాయందు దయ చూపి తగిన ఉపాయం చెప్పండి" అని కోరుకున్నాడు.

**శివుడు "నారాయణ మంత్రం జపిస్తూ మూడు సార్లు**

**మా చుట్టూ ప్రదక్షిణం చేయాలి. ఇది అన్ని తీర్థాలలో**

**తిరిగిన స్నాన ఫలితాన్ని ఇస్తుంది" అని చెప్పాడు.**

వినాయకుడు అదే విధంగా చేశాడు. ఆ మంత్ర ప్రభావం వల్ల గంగానదిలో స్నానమాడేందుకు వెళ్ళిన

కుమారస్వామికి తనకంటే ముందుగానే గజాననుడు ఆ నదిలో స్నానమాడి తనకు ఎదురుగా వస్తున్నట్టు అనిపించింది. అతనికి మూడు కోట్ల ఏభై లక్షల నదులో కూడా తనకంటే ముందుగానే గజాననుడు స్నానం చేస్తున్నట్టు కనిపించాడు.

ఇది చూసి ఆశ్చర్యపోయి, కైలాసానికి వెళ్ళి తండ్రి దగ్గర వున్న అన్నను చూసి, నమస్కరించి, తన బలాన్ని తిట్టుకుని "తండ్రీ, అన్నగారి మహిమ తెలియక ఆ విధంగా అన్నాను. క్షమించి ఆ ఆధిపత్యం అన్నగారికే ఇవ్వండి అని ప్రార్థించాడు.

భాద్రపద శుద్ధ చతుర్ధి రోజున పరమేశ్వరుడు గజాననుడికి విఘ్నాధిపత్యం ఇచ్చాడు. ఆ రోజు అన్ని దేశములవాళ్ళూ విఘ్నేశ్వరుడికి తమ స్థాయిని బట్టి కుడుములు, మిగిలిన పిండి వంటలు, కొబ్బరికాయలు, పాలు, తేనె, అరటి పళ్ళు,

పానకము, వడపప్పు మొదలైనవి సమర్పించి పూజించారు. విఘ్నేశ్వరుడు సంతోషపడి కుడుములు కొన్ని తిని, కొన్ని తన వాహనం అనింద్యుడికి ఇచ్చి, కొన్ని చేతిలో పట్టుకుని, నిదానంగా సూర్యాస్తమయం అవుతుండగా కైలాసానికి వెళ్ళాడు.

తల్లి తండ్రులకు నమస్కారం చేయబోగా పొట్ట భూమికి తగిలింది కానీ, చేతులు మాత్రం భూమిమీద ఆనలేదు. అతి కష్టం మీద చేతులు ఆన్చినా నమస్కారం మాత్రం చేయలేకపోయాడు. ఈ విధంగా గణపతి కష్టాలు పడుతుండగా శివుడి తల మీద వున్న చంద్రుడు పగలబడి, ఎగతాళిగా నవ్వాడు. 'రాజదృష్టి సోకితే, రాళ్ళు కూడా నుగ్గవుతాయి' అన్న సామెత అనుసరించి వినాయకుడి పొట్ట పగిలి లోపల వున్న కుడుములు మొదలైనవి చుట్టుపక్కల

ల వున్న కుడుములు మొదలైనవి చుట్టుపక్కల దొర్లాయి. వెంటనే వినాయకుడు మరణించాడు.

పార్వతి ఏడుస్తూ చంద్రుని చూసి "పాపాత్ముడా! నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించాడు. కాబట్టి నిన్ను చూసిన వాళ్ళు పాపాత్ములై నీలాపనిందలు పొందుతారు" అని శపించింది.

### "ఋషిపత్నులకు నీలాపనిందలు"

అదే సమయంలో సప్త మహర్షులు యజ్ఞం చేస్తూ తమ భార్యలతో అగ్ని ప్రదక్షిణం చేస్తున్నారు.

అగ్నిదేవుడు ఋషి పత్నులను చూసి మోహించి, మహర్షులు తనను శపిస్తారేమో అనే భయంతో రోజు రోజుకూ బలహీనంగా మారిపోవనారంభించాడు.

అది అగ్ని భార్య స్వాహాదేవి గ్రహించి అరుంధతీ రూపం తప్ప, మిగిలిన ఋషి పత్నుల రూపం ధరించి

భర్తకు సంతోషం కలిగించింది. ఋషులు తమ భార్యల రూపంలో వున్న స్వాహా దేవిని చూసి తమ భార్యలే అనుకుని భ్రమపడి వారిపై కోపం తెచ్చుకున్నారు.

శాపం పలితంగానే ఋషి పత్నులకు ఈ నిలాపనింద కలిగింది. దేవతులు, మునులు, ఋషి పత్నులు ఈ నీలాపనిందలను గూర్చి పరమేష్టికి తెలిపారు. అతడు సర్వజ్ఞుడు కావటంతో అగ్ని దేవుడి భార్యే ఋషి పత్నుల రూపం దాల్చిందని తెలుసుకుని సప్త ఋషులను సమాధానపరిచి వారితో కూడా తాను కైలాసానికి వెళ్ళి ఉమామ హేశ్వరులను సేవించి చనిపోయిన విఘ్నేశ్వరుని బతికించాడు. దాంతో పార్వతీ పరమేశ్వరులు ఎంతో సంతోషించారు.

అప్పుడు దేవతలు, మిగిలినవాళ్ళు "పార్వతీ, నువ్వు ఇచ్చిన శాపం వల్ల అన్ని లోకాలలో వున్న

వారికి కీడు జరుగుతోంది. కాబట్టి దానిని ఉపసంహరించు" అని ప్రార్థించారు. -

వారి ప్రార్ధనలకు సంతోషించిన పార్వతి సంతోషంతో కుమారుని దగ్గరకు తీసుకుని ముద్దాడి "ఏ రోజున వినాయకుని చూసి చంద్రుడు నవ్వాడో, ఆ ఒక్క రోజు మాత్రము చంద్రుని చూడకూడదు" అని చెప్పింది.

అప్పుడు బ్రహ్మ, మొదలైన దేవతలు సంతోషిస్తూ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. భాద్రపద శుద్ధ చతుర్థిలో మాత్రం చంద్రుని చూడకుండా జాగ్రత్త తీసుకుని సుఖంగా వున్నారు.

ఈ విధంగా కొంతకాలం గడిచింది.

### "శమంతకోపాఖ్యానము"

ద్వాపరయుగంలో ద్వారకావాసి అయిన శ్రీకృష్ణుని నారదుడు దర్శించి, ప్రార్థించి మాట్లాడుతూండగా "స్వామీ, సాయం కాలం అయింది. ఈ రోజు వినాయక చతుర్థి కాబట్టి పార్వతీదేవి శాపం వల్ల చంద్రుడిని చూడకూడదు. నేను నా ఇంటికి వెళ్తాను, అనుమతించండి" అని గతంలో జరిగినదంతా చెప్పి స్వర్గానికి వెళ్ళిపోయాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు ఆ రోజు రాత్రి చంద్రుడిని చూడకూడదని పట్టణంలో చాటింపు వేయించాడు. శ్రీ కృష్ణుడు క్షీర ప్రియుడు కావటంతో ఆ రోజు రాత్రి ఆకాశం వేపు చూడకుండా పశువులశాలకు వెళ్ళి పాలు పితుకుతూ పాలలో చంద్రుడిని ప్రతిబింబం చూసి "ఆహా! నాకు ఎలాంటి ఆపద రానుందో" అని అనుమానించటం ప్రారంభించాడు.

కొన్నాళ్ళకు సత్రాజిత్తు సూర్యవరంతో

శమంతకమణిని సంపాదించి శ్రీ కృష్ణుని చూడటానికి ద్వారకకు వచ్చాడు. శ్రీ కృష్ణుడు అతనికి మర్యాద చేసి ఆ మణిని తనకు ఇవ్వమని అడిగాడు.

అప్పుడు సత్రాజిత్తు "ఇది రోజుకు ఎనిమిది బారువుల బంగారం ఇస్తుంది. దీనిని ఏ ఆప్తునికైనా ఏ తెలివితక్కువవాడు ఇవ్వడు" అన్నాడు. శ్రీ కృష్ణుడు ఊరుకున్నాడు.

ఒకరోజు సత్రాజిత్తుని తమ్ముడు ప్రసేనుడు శమంతకమణిని కంఠానికి ధరించి వేటాడేందుకు అడవికి వెళ్ళగా అక్కడ ఒక సింహం ఆ మణిని మాంసం అనుకుని ప్రసేనుడిని చంపింది. ఆ సింహం ఆ మణిని తీసుకుపోవుచుండగా, ఒక భల్లూకం ఆ సింహాన్ని చంపి, ఆ మణిని తీసుకుని తాను వుండే కొండ బిలానికి వెళ్ళి, తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చింది.

మరునాడు సత్రాజిత్తు తమ్ముడి మృతి వార్త విని "నేను ఆ మణిని ఇవ్వలేదని శ్రీ కృష్ణుడు నా తమ్ముడిని చంపి రత్నం అపహరించాడు" తన పట్టణంలో చాటింపు వేయించాడు.

శ్రీ కృష్ణుడు అది విని ఆ రోజు పాలలో చంద్రుడిని చూసినందువల్లే ఈ నింద వచ్చింది అని భావించి, దానిని తొలగించుకొనేందుకు బంధు మిత్రులతో కలిసి అరణ్యంలో వెతకగా ఒక చోట ప్రసేనుడి కళేబరం, సింహపు కాలి జాడలు, భల్లూకం కాలిజాడ కనిపించాయి. వాటిని అనుసరించి పోతూ ఒక పర్వత గుహద్వారంలో పరివారాన్ని వదిలి తానొక్కడే లోపలికి వెళ్ళి, అక్కడ ఉయ్యాలకి కట్టబడి వున్న మణిని తీసుకుని తిరిగి వచ్చుచుండగా, అది చూసి వింతమనిషి వచ్చాడు అంటూ జాంబవతి కేకలు వేసింది.

అంతలో జాంబవంతుడు రోషంగా అక్కడికి వచ్చి, అరుస్తూ, గోళ్లతో గుచ్చుతూ శ్రీకృష్ణుడి పై యుద్ధం ప్రారంభిచాడు. శ్రీ కృష్ణుడు అతనిని కింద పడదోసి భీకర యుద్ధం ప్రారంభించాడు. ఆ విధంగా మొత్తం 28 రోజులు పోట్లాడారు. చివరకు జాంబవంతుడు శక్తిహీనుడై తనతో పోట్లాటకు దిగినవాడు రావణసంహారి అయిన శ్రీరామ చంద్రుడే అని అర్థం చేసుకుని, నమస్కరించి "దేవాదిదేవా! ఆర్త జన రక్షకా! నిన్ను త్రేతాయుగంలో రావణాది దుష్ట రాక్షసులను చంపేందుకు వచ్చిన శ్రీరామ చంద్రుడని అర్థం చేసుకున్నాను. అప్పుడు నన్ను మీరు ఒక వరం కోరుకోమన్నారు. నేను తెలివితక్కువగా మీతో ద్వంద్వ యుద్ధం చేయాలని కోరుకున్నాను. త్వరలో అది జరుగుతుందని మీరు చెప్పారు. అది మొదలు మీ నామస్మరణ చేస్తూ అనేక యుగాలు

గడుపుతూ వచ్చాను. మీరు ఇప్పుడు నా నివాసానికి వచ్చి నా కోరిక నెరవేర్చారు. నా శరీరం అంతా శిథిలం అయింది. ప్రాణాలు త్వరలో పోనున్నాయి. జీవితేచ్ఛ నశించింది. నా అపచారములు క్షమించి నన్ను కాపాడు. నీకంటే నాకు వేరే దిక్కు లేదు" అంటూ ప్రార్థించాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు దయతో జాంబవంతుడి తన చేతితో నిమిరి "జాంబవంతా! శమంతక మణిని దొంగిలించానని నాపై వచ్చిన అపనింద తొలగించుకోవటం కోసమే వచ్చాను కాబట్టి మణిని నాకు ఇవ్వు. నేను వెళ్ళిపోతాను" అని చెప్పాడు.

అప్పుడు జాంబవంతుడు శ్రీ కృష్ణునికి మణితో పాటు, తన కుమార్తెను కూడా ఇచ్చాడు. తన ఆలస్యం వల్ల ఆందోళన చెందుతున్న బంధువులతో, సైన్యంతో, మణితో, జాంబవతితో కలిసి తన

నగరానికి వెళ్ళాడు.

సత్రాజిత్తును పిలిపించి, అందరిని పిలిచి జరిగినదంతా వివరించి, మణిని ఇచ్చాడు. అప్పుడు సత్రాజిత్తు "అయ్యో, లేనిపోని నింద మోపి దోషానికి పాల్పడ్డాను" అని విచారించాడు. మణితో పాటుగా తన కుమార్తె సత్యభామను కూడా ఇచ్చి, తన తప్పు క్షమించమని వేడుకున్నాడు.

శ్రీ కృష్ణుడు ఒక శుభ ముహూర్తంలో జాంబవతీ, సత్య భామలను వివాహమాడాడు. అప్పుడు దేవతలు, మునులు శ్రీ కృష్ణుడిని స్తుతించి "మీరు సమర్థులు కాబట్టి నీలాపనింద పోగొట్టుకున్నారు. మాలాటి వారు ఏమి చేయగలరు?" అని ప్రార్థించారు. అప్పుడు శ్రీ కృష్ణుడు "భాద్రపద శుద్ధ చతుర్థిలో ప్రమాదవశాత్తూ చంద్రుని దర్శనమైతే, ఆరోజు గణపతిని పూజించి శమంతకమణి కథను విని

పూజాక్షతలు తలపై వేసుకున్నట్లయితే నీలాపనిందలు పొందకుండా వుంటారు" అని చెప్పాడు. దాంతో దేవతలు, మునులు సంతోషించి తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్థిలో దేవతలు, మహర్షులు, మానవులు మొదలగువారు గణపతిని పూజించి, తమ కోరికలు నెరవేర్చుకుని ఆనందంగా వున్నారని - శాపమోక్ష విధానం శౌనకాది మునులకు వివరించిన తర్వాత, సూత - మహాముని తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు."ప్రజా ప్రశ్న "ప్రత్యేక కథనం.. మేడ్చల్ ప్రతినిధి" చిన్న "

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588